

మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి. చిత్రంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేష్, వంశీకృష్ణశ్రీనివాసయాదవ్, తదితరులు

వైకాపా పాలనలో విశాఖ విలవిల

ఈనాడు, విశాఖపట్నం

'వైకాపా అయిదేళ్ల పాలనలో విశాఖ విలవిల్లాడింది. అంతటా విధ్వంసకర పాలన సాగింది. ఎక్కడికక్కడ ఆస్తులను దోచేశారు. చివరకు ప్రభుత్వ అతిథిగృహంలోనే పంచాయితీలు చేశారు' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విమర్శించారు.

విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా మొదటి సారి విశాఖకు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం తెదేపా కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలతో సమావేశం, కలెక్టరేట్లో జిల్లా అధికారులతో పలు అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో వైకాపా దుర్మార్గ పాలన పోగొట్టడానికి కూటమి కార్యకర్తలు, నేతలు ఎన్నో త్యాగాలు చేశారు. కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుంది. అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్రం సహకారంతో మరింత వృద్ధి సాధిస్తాం. గతంలో విశాఖ నుంచి 'లులు' గ్రూపు వెళ్లిపోయింది. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ తిరిగొస్తుంది. విజయనగరం జిల్లా గుర్లలోని అతిసారానికి జగన్ ప్రభుత్వం తీరే కారణం. పంచాయతీలను నిర్వీర్యం చేయడంతోనే రాష్ట్రంలోని గ్రామాల్లో ఆ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంట్లో తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు ఏం చేస్తారు' అని మంత్రి విమర్శించారు.

విశాఖలోనే చదువుకున్నా: నగరంపై తనకు అవగాహన ఉందని, వైద్య విద్య ఆంధ్రా వైద్య కళాశాలలోనే చదివానని మంత్రి గుర్తు చేసుకున్నారు. పార్టీ అధినేత అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానన్నారు. నగరీకరణతో పాటు ఉపాధి అవకాశాలకు, ఆహ్లాదకర వాతావరణంతో ఆర్థిక రాజధానిగా విశాఖకు ఎంతో గుర్తింపు ఉంది. మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా అంతా కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం కష్టపడుతుంది. టీసీఎస్ ద్వారా పది వేల మందికి ఉపాధి లభించనుంది, ఇన్ఫోసిస్‌లో ప్రస్తుతం వెయ్యి మంది పనిచేస్తుండగా మరో వెయ్యి మందికి ఉపాధి అందేలా ప్రణాళిక చేస్తున్నాం. రైల్వేజోన్, స్టీల్‌ప్లాంటు అంశాలు ప్రస్తుతం ప్రజల మదిలో నలుగుతున్న సమస్యలు. వీటి మీద కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యతతో వ్యవహరిస్తుంది. విశాఖకు లేకుండా అమరావతికి అన్నీ వెళ్లిపోతున్నాయని కొందరు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అమరావతిలో ఏమీ లేనందున అక్కడ ఏర్పాటు చేయాల్సి వస్తుంది' అని పేర్కొన్నారు.

- కూటమి హయాంలో అమరావతితో పాటు అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి
- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

కష్టపడిన వారికి న్యాయం: 'అయిదేళ్లు దోచుకున్న విజయసాయిరెడ్డి వైకాపా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా విశాఖకు మళ్లీ వచ్చాడు' అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. దిల్లీ నడివీధుల్లో చేతకాదని చెప్పిన వ్యక్తి ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ కోసం నిరాహారదీక్ష చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇంట్లోని సమస్యలను పరిష్కరించుకోలేని జగన్ రాష్ట్రంలోని సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఎవరైతే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారో వారందరికీ నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి ఎమ్మెల్యే ఆయా నియోజకవర్గాల్లోని సమస్యలతో కూడిన వినతులను ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్తే ప్రభుత్వంలోని పెద్దలతో సమన్వయం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

● ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ శాసనసభ సమావేశాల్లో డోలా గట్టిగా ప్రశ్నించేవారన్నారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని మంత్రిని కోరారు. భాజపా నేతలు కాశీ విశ్వనాథరాజు, నరేంద్ర కేంద్ర సహకారం వివరించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తెదేపా విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, చిరంజీవిరావు, ఏపీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నజీర్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో కూటమి నేతలు, కార్యకర్తలు

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు వెలమ కుల వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వెలమ అవివాహితులకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం పెందుర్తి వెలమతోట (అనకాపల్లి రోడ్డు)లోని శ్రీవెలమ రైతు సేవా సంఘం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (**శనివారం, అక్టోబరు 26న**), రేపు (**ఆదివారం, అక్టోబరు 27న**) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **91549 18858, 80080 01686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా, యాప్ ద్వారానూ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు. **- న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ**





ఏయూలో డ్యూయల్ డిగ్రీ కోర్సులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వ విద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రారంభించనున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వార్షిక బోర్డు ఆఫ్ స్టడీస్ (బి.ఒ.ఎస్) సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతిపాదించడం జరుగుతోందన్నారు. బీటెక్‌లో వి.ఎల్.ఎస్.ఐ., ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. 2018 నుంచి ఏయూలో చదివి అనివార్య కారణాల వల్ల మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాలేని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం రీ ఎగ్జామినేషన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య జి.గిరిజాశంకర్, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య డి.నాగరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వీసీ ఆచార్య జి.శశిభూషణరావు



కేజీహెచ్‌కు రూ.కోటి సీఎస్ఆర్ నిధులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) కేజీహెచ్‌కు రూ.కోటి విడుదల చేసింది. శుక్రవారం పోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ వి.శివానందకు ఛైర్మన్ అంగముత్తు ఈ మేరకు చెక్కు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సిఫార్సు మేరకు కేజీహెచ్ క్యాజువాల్టీ, ఓపీ విభాగం నవీకరణకు పోర్టు ఈ నిధులు కేటాయించిందని డాక్టర్ శివానంద తెలిపారు.



డాక్టర్ శివానందకు చెక్కు అందజేస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్.కవితకు పదోన్నతి

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 13 మంది సీనియర్ సివిల్ న్యాయమూర్తులకు జిల్లా న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను జారీచేసింది. వీరిలో విశాఖ ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.కవిత ఉన్నారు. ఆమె పదోన్నతిపై గాజువాక ఎనిమిదో అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

ఉక్కులో వీఆర్ఎస్‌కు 1,500 మంది సుముఖత

ఉక్కునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కులో ఇటీవల యాజమాన్యం జారీ చేసిన వీఆర్ఎస్ (స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం) సర్వే ఉత్తర్వులకు ఉద్యోగుల్లో స్పందన బాగానే ఉంది. ఈనెల 29 వరకు గడువు ఉన్నా, శుక్రవారం నాటికి 1,500 మంది అధికారులు, సాధారణ ఉద్యోగులు సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. యాజమాన్యం పేర్కొంటున్నట్లు '2500 మంది వీఆర్ఎస్' లక్ష్యం వైపు అడుగులు పడుతున్నాయని, అంతమంది ఒకేసారి వెళ్లిపోతే కర్మాగారం భవిష్యత్తు ఏంటని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జలవనరులశాఖ నార్త్‌కోస్టు సీఈగా రామ్‌గోపాల్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ నార్త్‌కోస్టు చీఫ్ ఇంజినీరు (సీఈ)గా డి.రామ్‌గోపాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కర్నూలు ఎస్ఈగా పనిచేస్తున్నారు. జలవనరుల శాఖ విశాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.సుగుణాకరరావును విజయవాడ సీఈ (ఇన్‌ఛార్జి)గా నియమించారు.





ఐటీ ఉద్యోగుల భద్రతకు అవుట్ పోస్ట్: సీపీ

మధురవాడ, న్యూస్‌టుడే: ఐటీ పరిశ్రమల్లో పగలు, రాత్రి విధులు నిర్వహించే ఉద్యోగుల భద్రత దృష్ట్యా 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. రుషికొండ ఐటీ హిల్ కూడలిలో పీఎంపాలెం పోలీసు ఆధ్వర్యంలో 'సెక్యూరిటీ ఐటీ పోస్ట్' సహకారంతో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు అవుట్‌పోస్ట్‌ను సీపీ శుక్రవారం ప్రారంభించారు. అభివృద్ధి దిశగా అడుగులు వేయనున్న ఐటీ కేంద్రంలో పోలీసు రక్షణ ఎంతో అవసరమని గుర్తించి నిరంతరం అందుబాటులో ఉండేలా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ఎప్పటికప్పుడు పోలీసు గస్తీ ఉంటుందన్నారు. డీసీపీ-1 అజిత వేజెండ్ల, జోన్-2 జడ్సీ పి.సింహాచలం, నార్త్‌జోన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ, ఎస్సైలు సునీత పాల్గొన్నారు.



పోలీసు అవుట్‌పోస్ట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ, తదితరులు

బీచ్‌రోడ్డు, ఐటీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: సీపీ



సీపీకి సమస్యలు వివరిస్తున్న సింబయాసిస్ సీఈవో నరేష్‌కుమార్

మధురవాడ, న్యూస్‌టుడే: పర్యాటక, వ్యాపార రంగాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని బీచ్‌రోడ్డు, ఐటీ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. ఐటీ హిల్‌లోని సింబయాసిస్ టెక్నాలజీస్ సంస్థలో సీఈవో ఓ.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పలు ఐటీ సంస్థల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీపీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్‌తో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు వివిధ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఐటీ పరిశ్రమలకు వచ్చే మార్గాల్లో వీధి దీపాలు వెలగక మహిళా ఉద్యోగులు భయాందోళనకు లోనవుతున్నారని, పోలీసు గస్తీ వాహనం ఏర్పాటు చేయాలని తదితర వాటిని ప్రస్తావించారు. దీనిపై స్పందించిన సీపీ మాట్లాడుతూ ఐటీ ఉద్యోగుల రక్షణలో భాగంగానే పోలీసు అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. గడచిన మూడు రోజుల నుంచి పీఎంపాలెం రక్షక్ వాహనం బీచ్‌రోడ్డు, ఐటీ ప్రాంతాల్లో తిరుగుతోందన్నారు. కారు షెడ్డు కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజిత వేజెండ్ల, నార్త్‌జోన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, సీఐ జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో సమ్మె విరమణ

ఉక్కునగరం(కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 28న విశాఖ ఉక్కులో సమ్మె చేపట్టేందుకు నోటీసు ఇచ్చిన కార్మిక సంఘాలు... సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు శుక్రవారం అధికారులకు తెలిపారు. కర్మాగారంలో ట్రైపార్టీ ప్రారంభిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అధికారులు తెలిపారు. సమావేశంలో అధికారులు ఎం.వరప్రసాద్, మోహన్, కార్మిక నాయకులు జె.రామకృష్ణ, ఎన్.రామచంద్రరావు, శ్రీ.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	105	100
లైవ్	127	120
డ్రెస్డ్	184	210
స్కిన్‌లెస్	210	220

బ్యాంక్ ఆఫ్ బరోడా

Bank of Baroda 117

ఆర్ ఓ స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, రీజినల్ ఆఫీస్: 10-1-44/10&11, 4వ అంతస్తు, పీజే ప్లాజా, విఐపి రోడ్డు, హోటల్ టైకూన్ ఎదురుగా, విశాఖపట్నం-03., e-mail: sarvis@bankofbaroda.com

అధీకృత అధికారి పేరు : శ్రీ జీతేషు జేనా (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం.7995565212

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

అపెండిక్స్- IV – A (రూల్ 6 (2) & 8(6) చూడుము)

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు)లకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా/ఛార్జ్‌డ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తిని "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ ఆస్తు(లు) / బకాయి మొత్తము/రిజర్వు ధర/ ఇ-వేలం బిడ్ పెంపుదల మొత్తము వివరములు ఈ దిగువ చెప్పబడినవి.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) మెస్సర్స్ మాతృశ్రీ ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్: శ్రీమతి ఎరెల్లి తులసి (ఋణగ్రహీత), భర్త: శ్రీ ఇ.లోవరాజు, ప్లాటు నెం.63 & 64, బి-బ్లాకు, ఆటో నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చిట్టివానిపాలెం, గాజువాక, విశాఖపట్నం-530046. 2. శ్రీమతి ఎరెల్లి తులసి (మేనేజింగ్ పార్టనర్/ఋణగ్రహీత), భర్త:శ్రీ ఇ.లోవరాజు, డి.నెం. 12-119/1, బిసి కాలనీ, అగనంపూడి, గాజువాక, విశాఖపట్నం-530046. 3. శ్రీ నాగులపల్లి రమేష్ (పార్టనర్/ఋణగ్రహీత), తండ్రి: శ్రీ రాము, డి.నెం.12-119/1, బిసి కాలనీ, అగనంపూడి, గాజువాక విశాఖపట్నం-530046. 4. శ్రీమతి ఎదలాడ అమ్మాజమ్మ (పార్టనర్/ ఋణగ్రహీత), భర్త: లేటు శ్రీ నానాజీ, డి.నెం.58-11-6/7, ఫ్లాట్ నెం.6, మూడవ అంతస్తు, సత్యసాయి నివాస్, కరాస, విశాఖపట్నం-530018. 5. శ్రీ గొర్స శ్రీనివాసు (హామీదారు), తండ్రి: సత్యనారాయణ, ఎంఐజి 21, సెక్టార్-5, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం-17.

బ్యాంక్‌కు రావలసిన మొత్తం బకాయి: రూ.84,92,805.08 పై. (అక్షరాల ఎనభై నాలుగు లక్షల తొంభై రెండు వేల ఎనిమిది వందల అయిదు రూపాయల ఎనిమిది పైసలు మాత్రమే) + తేది: 31-12-2019 నుండి చెల్లింపుచేయు తేది వరకు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

ఆస్తుల వివరములు (స్వాధీనత స్వభావం : నిర్మాణాత్మక):

విశాఖపట్నం జిల్లా, ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, (ఎన్ఎడి జంక్షన్), వార్డు నెం.44ఎ లోని మర్రిపాలెం గ్రామం, కరాస శివారు వద్ద సర్వే నెం.120/భాగంలోని 179.66 చ॥గ॥లలో 22.45 చ॥గ॥ల అవిభాజ్య మరియు అనిర్ధేశపు వాటాతో గల స్థలం అందు "శ్రీ సత్య సాయి నివాస్" మూడవ అంతస్తులోని 625 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, అసెస్డ్ నెం.73999/1221 (తరువాత సవరించబడినది), అసెస్‌మెంట్ నెం.73999/1949, డి.నెం.58-11/6/7 (పాత డోర్ నెం.58-11-6/6)తో గల ఆర్‌సిసి స్లాబ్ రూఫ్ ఫ్లాట్ నెం.6. హద్దులు: తూర్పు: వి.అప్పారావు మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం: 20 అ॥ల రోడ్డు, పడమర: శ్రీమతి బి.విజయలక్ష్మి గారి ఇల్లు, ఉత్తరం: శ్రీమతి నాగరపు జగదాంబ గారి ఇల్లు. కొలతలు: తూర్పు నుండి పడమర: 49 అ॥లు లేదా 14.93 మీ॥లు, ఉత్తరం నుండి దక్షిణం: 33 అ॥లు లేదా 10.05 మీటర్లు. మూడవ అంతస్తులోని ప్లాటు నెం.6కు హద్దులు: తూర్పు: ఓపెన్ స్పేస్, వి.అప్పారావు మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం: ఓపెన్ స్పేస్, 20 అ॥ల రోడ్డు, పడమర: ఓపెన్ స్పేస్ శ్రీమతి బి.విజయలక్ష్మి గారి ఆస్తి. ఉత్తరం: కామన్ మెట్ల దారి.

రిజర్వు ధర : రూ.27,87,000/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల ఎనభై ఏడు వేల రూపాయలు మాత్రమే)

ధరావత్తు : రూ.2,78,700/- (అక్షరాల రెండు లక్షల డెబ్బై ఎనిమిది వేల ఏడు వందల రూపాయలు మాత్రమే)

బిడ్ పెంపుదల మొత్తం : రూ.25,000/- (అక్షరాల ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది మరియు సమయం : 27-11-2024 మ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు వేలం ముగిసేవరకు ప్రతీ 10 నిమిషాలకు ఒక్కసారి అన్‌లిమిటెడ్ ఆటో ఎక్స్‌టెన్షన్ ఉండును.

పై ఆస్తులను తేది.19-11-2024 ఉ॥11.00 నుండి సా॥ 04.00 గం॥ల వరకు తనిఖీ చేసుకోగలరు. | ఆస్తులపై ఎన్‌కంబ్రెన్స్ : లేదు

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్ సైట్ :https://www.bankofbaroda.in/e-auction.htm and https://ebkray.in లింక్‌ను రీఫర్ చేయండి. ఆసక్తి గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క మొబైల్: 7995565212 ను సంప్రదించగలరు.

తేది : 25-10-2024, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda 117

సీతమ్మధార బ్రాంచ్, డోర్ నెం.50-53-11/8, రవి ప్లాజా, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఫోన్: 0891-2552472, మొబైల్: 7995565152, ఇ-మెయిల్: savsee@bankofbaroda.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

APPENDIX- IV-A [SEE PROVISO TO RULE 6 (2) & 8 (6)]

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6(2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు)కు తెలియచేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి తనఖా / ఛార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తిని "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" ప్రాతిపదికన అమ్మకం జరువబడును. ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ అసెట్/లు/బకాయిలు/రిజర్వ్ ధర/ఇ-వేలం తేది & సమయం, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువన పేర్కొనబడినవి.

వ. నెం.	ఋణగ్రహీతలు / హామీదారుల / తనఖాదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	బకాయి మొత్తము	ఇ-వేలం తేది & సమయం	రిజర్వు ధర, ధరావత్తు & బిడ్ పెంపుదల మొత్తం
1	M/s సంతోషి ఇంజినీరింగ్, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టనర్లు: 1. శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు, తండ్రి: బొక్కా కృష్ణారావు, 2. శ్రీమతి బొక్కా వరలక్ష్మి, భర్త: శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు మరియు హామీదారులు: 1. శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు, తండ్రి: బొక్కా కృష్ణారావు, 2. శ్రీమతి బొక్కా వరలక్ష్మి, భర్త: శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు.	విశాఖపట్నం జిల్లా, యలమంచిలి రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, అచ్యుతాపురం మండలం, వెదురువాడ గ్రామం మరియు పంచాయతీ, ఎస్.నెం. 27/పి, ఎల్.పి. నెం.25/2005/వి ద్వారా డి.టి.సి.పి, హైదరాబాద్ ఆమోదించిన లేఅవుటు, "సాయి ప్రియ గార్డెన్-II" ప్లాట్ నెం. 57 లోని 200 చ॥గ॥ లేదా 167 చ॥మీ॥ స్థలం. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 58, దక్షిణం: ప్లాట్ నెం.76, పడమర: ప్లాట్ నెం.56, ఉత్తరం: 33 అ॥ రోడ్డు. తనఖాదారు: శ్రీ. బొక్కా వెంకట లక్ష్మి నరసింహా రావు, శ్రీమతి బొక్కా వరలక్ష్మి	రూ. 83,46,351.21 (అక్షరాల ఎనభై మూడు లక్షల నలభై ఆరు వేల మూడు వందల యాభై ఒకటి రూపాయల ఇరవై ఒకటి పైసలు) + రివర్సల్ ఆఫ్ అన్ రియలైజ్డ్ వడ్డీ + తేది 01.10.2023 నుండి వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలు.	తేది: 27.11.2024 మ॥ 02.00 గం.ల నుండి సా॥ 06.00 గం.ల వరకు (వేలం ముగిసేవరకు ప్రతీ 10 నిమిషాలకు ఒకసారి అన్‌లిమిటెడ్ ఆటో ఎక్స్‌టెన్షన్ ఉండును)	రిజర్వు ధర: రూ. 36,00,000/- (అక్షరాల ముప్పై ఆరు లక్షల రూపాయలు మాత్రమే) ధరావత్తు: రూ. 3,60,000/- (అక్షరాల మూడు లక్షల అరవై వేలరూపాయలు మాత్రమే) బిడ్ పెంపుదల మొత్తం: రూ. 25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)

స్వాధీనం యొక్క స్వభావము: భౌతిక స్వాధీనం ; ఆస్తి తనిఖీ యొక్క తేది & సమయం: తేది 12.11.2024 నుండి ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 4:00 గం.ల వరకు

అమ్మకం యొక్క పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ లింకును https://www.bankofbaroda.in/e-auction.htm రిఫర్/చూడండి మరియు ఆన్‌లైన్ అమ్మకం పోర్టల్ https://ebkray.in ను కూడా చూడవచ్చును. ఆసక్తి గల బిడ్డర్లు అధీకృత అధికారి: శ్రీ. మెహర్ ప్రకాశ్ చంద్ర గారిని మొబైల్ నెం. 7995565152 నందు సంప్రదించవచ్చును.

తేది: 25.10.2024, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

EENADU Classifieds

BUSINESS SERVICES

లోన్స్ గోల్డ్ లోన్స్ బ్యాంక్ / ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆధిక ధరకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులో తనఖా ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనుగోలు చేయబడును. సాయి EV. Golds 7075086333.

మీ బంగారాన్ని బ్యాంక్/ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి విడిపించుకోలేని వారికి మార్కెట్ ధర ప్రకారం కొనబడును. 916 బంగారం నగలు తక్షణమే ఆధిక ధరకు కొనబడును. ✆ 8106919069.

FINANCIAL SERVICES

ఉద్యోగ వర్గాల లోన్స్ ఉద్యోగులకు వెంటనే పర్సనల్ లోన్స్ ... ✆ 7095322211.

HOME NEEDS

INTERIOR DECORATORS

Looking for best interiors? DREAMHUTZ INTERIORS. Get 10% off on wardrobes and modular kitchens! Call: 9948151289 for more details.

MARRIAGE SERVICES

మీ అమ్మాయి/ అబ్బాయికి పెళ్లి సంబంధం ... ✆ 7997019690.

PEOPLE CARE

OLD AGE HOME

వృద్ధుల ఆశ్రమం ... ✆ 7794948777.

REAL ESTATE

FLAT FOR SALE

BEACH ROAD

2560 Sft Ready to Occupy, Each 5 Floors North face, 80 Sqyds UDS, 2 Car parkings, Prime area, RK Beach Road, Pandu Ranga puram. Contact: 8978763496.

700 Sft, 1BHK Flat, 3rd Floor F.No. 308, Chinawaltair, Visakhapatnam. Near RK Beach. 8585869660, 9032600229.

DWARAKANAGAR

FLAT FOR SALE 3 BHK 1260 Sft E/W Seethampeta Main Road, Beside Central Bank. 3 BHK 1450 Sft N/S Dwarakanagar Near Boy London Showroom. Commercial & Residential. * UNDER CONSTRUCTION * 98494 27319

MADHURAWADA

2&3BHK Flat for Sale Gated Community at affordable Prices Madhurawada & Tagarapuvalasa. Contact: 9652916699/ 9573518399.

2BHK 1080 Sft. East and 3BHK 1440 West Facing Flats with Super Deluxe Specifications for Sale at P.M.Palem Last Bus Stop. 8886247888.

Ready to Occupy 3 BHK 1445 Sft. Luxurious Flat (No GST) Opp. Cine Polis IT Hub Rd., Midhilapuri Colony, Madhurawada 9949551444.

945 Sft. 2BHK East Facing, 1st Floor with Car Parking & Lift in Anandi Arcade behind D-Mart Madhurawada. UDS 42 Sqyds. ✆ 8008521998, 9449120494.

మధురవాడ 3BHK 1340 Sft ... ✆ 9949482739, 7702633826.

MVP COLONY

1000Sft 2BHK East Facing 3 Years Old, Including Interiors at MVP Colony Sector -5, Simhadri Homes Appt. Cont: 9494332914.

YENDADA

FLATS FOR SALE Gated Community, 2 BHK, 1225 Sft. & 1110 Sft., NEW FLATS, Vaisakhi Skyline, Yendada, Vizag with ATTRACTIVE PRICE 8184815118 8520957200

Flat for Sale 850-100 Sft. Car Parking, 2 BHK Flat 408, MVV Harmony, Nr. HDFC Bank, Yendada Jn. 44 Lakh. Ph: 8989732152.

GENERAL

Apt sale East Pt Colony 1845 sft East fcng 5 min from VUDA park Ph: 7680944577, 9949496338

FLATS FOR SALE — READY TO OCCUPY — GATED COMMUNITY — In the HEART of the CITY — PEDDAWALTAIR, VISAKHAPATNAM — GROUND AND FIRST FLOOR FLATS ONLY AVAILABLE — CONTACT: 7382516799 8309224184 — E-Mail: customers.gayathriestates@gmail.com — Website: www.gayathriestates.com

Vizag, Duvvada ✆ SunRise City near Pharmacity Village 3BHK, 1490 Sft Car Parking & Lift for Sale. ✆ 9849366605.

Flat for sale 3 BHK East Facing 2 Months to handover P.M.Palem 1st Bus Stop, Madhurawada ✆ 7981135813, 7993729143.

HOUSE FOR SALE

GAJUWAKA

ఇండిపెండెంట్ హౌస్ 300 గజాలలో ... ✆ 9491803404.

PENDURTHI

VUDA 3BHK Duplex Houses for Sale. 2400 Sft. with Car Parking at Sujathanagar, Teachers Layout. Contact: 9849215235, 0891 2588325.

GENERAL

VZM లో RTC కాంప్లెక్స్ దగ్గర ... ✆ 9949014654, 9494905236.

LAND FOR SALE

NARSIPATNAM

108 Acers Land, for Sale in Narsipatnam with 80,000 Teak Trees (25 years), only serious buyers. Cont: 8099999007.

PLOT FOR SALE

ANANDAPURAM

VMRDA Approved Plots @ Anandapuram Highway Facing, Palavalasa Toll Gate Sqyd. 25,000/-. Only. Call: 9640604642.

ANAKAPALLI

అనకాపల్లి జిల్లా & మండలం ... ✆ 7780647343.

ATCHYUTAPURAM

Vizag Financial Capital VMRDA 1275 Sqyds. Commercial Plot at 250 ft Master Plan Road Atchutapuram for Sale. ✆ 8639765271

BHEEMILI

SITE FOR SALE West Facing 500/750 Sq.yards Site at BHIMILI TOWN, Beach Road Opp. REBOOT HOTEL with CRZ Permission. No Brokers. 9908945799 9989458986

BHOGAPURAM

Direct NH-16: Highway Facing 200 E/F, 267 Sq.Yds Premium Corner Plots @Bhogapuram & Pydibhimavaram Jn., 90% Bank Loan Facility. ✆ 8309916918.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ సమీపంలో ... ✆ 8978446704.

Farm Land available from NH-5 to Site 1.5 KM with Swimming Pool and Club House. Very reasonable Price. Contact: 8008597604.

భోగాపురం - పోలిపల్లి ... ✆ 7799765558, 7799765559.

ప్రాంతం NH-16 ... ✆ 9347353716.

GAJUWAKA

PLOT FOR SALE 311 Sq yards, Plot No MIG-65, VUDA Layout, Pedagantyada Village, Gandhinagar Phase-II, GAJUWAKA for sale 9052597156 9985188015

KAPULUPPADA

కాపులుప్పాడ ... ✆ 9069844450.

TAGARAPUVALASA

Avinash Properties Dussehra Bonanza - 5 gms gold free on every Plot Booking. Newly Launched with Fully Developed Ventures in Dakamarri & Jonnada with VUDA approval and RERA approval. Starts from 167 Sq.Yds. 90% Bank Loan available. 9868844433.

GENERAL

6000 Sq.Y. Beach Facing Close to Vizag, Film Nagar Club, 2500 Sq.Y. Nr. INS Kalinga is For Sale. ✆ 9849100212, 9494591415.

VJA, రాజులు ... ✆ 9398579997.

COMMERCIAL SPACE FOR SALE

విజయనగరం టౌన్ ... ✆ 9908335577.

LEASE/ RENT

Rent/Lease @ MVP Colony, Sec 11, VSP. 6300 Sft & 16,500 Sft Suitable for Colleges, MNC Etc. Ph: 9849120130, 9848065402.

WANTED

Wanted 30 Acres of Land (with clear Title) for Layout/ Residential purpose in between Anandapuram to Bhogapuram 1 to 2 KMs Radius from NH-16. Contact: 7997996785.

LEASE/ SALE

JAGADAMBA

Nr. Jagadamba Jn., 1200 Sqyds Site to Lease after Building to suit your needs or for Sale. suitable for any Commercial & Residential WhatsApp: +91 8977644775.

TO LET

BEACH ROAD

3 BHK E/F 2750 Sft Flat Air Conditioned with open Modular Kitchen & 2 Car Covered. Parking at Kirlampudi Layout, Nr. Beach Road. 9848522169.

RAMATALKIES

Tolet: 3B/R 1400 Sft. West Facing 2nd Floor, Near Timpany School, CBM Compound, Vizag. Ph: 7989209567.

SEETHAMMADHARA

To-Let in Seethammadhara North Extension, Opp. Hill View Park North Gate, D.No.: 50-116-5/2, Complete 1st Floor, 3BHK with Separate Drawing & Puja Rooms, East Facing. Con.: 9441518005.

SHEELANAGAR

3BHK Flat F303 in SL Surya Plaza, 8th Lane, Sri Venkateswara Colony, Sheelanagar. Lift & Car Parking. ✆ 9494666990.

GENERAL

3 BHK Flat 1675 sq.ft For Rent at Madhuranagar. Rent @ 30,000/- PM. Contact: 8452047891 for Details

3BHK, 1350' Flat for rent with lift and parking at Riddhi Enclave in Pithapuram colony vizag. Ph: 7032482682

SECOND SALE

మిధున్ ఏజెన్సీస్: పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఆన్‌లైన్ UPSలు, మోటార్లు, వాషింగ్‌మిషన్స్, సిక్ ఇండస్ట్రీస్ కొనబడును. సంప్ర॥ 6309745364.

JOBS

Wanted *Field Sales Executives M/F. *Field Team Leaders M/F. Qualification Not Required. Interviews on: 25th to 28th Oct. GSM Home Made Pickles. 6304441208, 8500133456.

Wanted - Designers / DTP Operators -2Nos * Photoshop / AI /Corel / ID. Vizag, Ramatalkies Road. Ph: 9933540011.

Hiring * Accountant * Jr. Engineer * Admin & HR Asst. * Industrial Sales Exec. Experience: 6 to 3 Yrs. Contact: 9014633436.

కనీసం 2 సం॥ల అనుభవం ఉన్న టెక్నీషియన్స్ & అడ్వైజర్స్ కావలెను — Sita Prime Honda హోండా 2 వీలర్ షోరూం — మధురవాడ, విశాఖపట్నం-41 — 8977999082 9666838334

Job Vacancies Only for Ladies ప్రముఖ కార్పొరేట్ సంస్థనందు నూతనంగా ప్రారంభించబోవు సెంట్రల్ ఆఫీసునందు పనిచేయుటకు దిగువ సిబ్బంది కావలెను. * Office Managers: 2 ఖాళీలు 35 సం॥ పైబడి, డిగ్రీతో 5 సం॥ ఉద్యోగ అనుభవం కలిగినవారు అర్హులు. ఆదాయం: 40,000 P.M. (అన్నీ కలిపి) * Relationship Managers: 6 ఖాళీలు, 30 సం॥ పైబడి ఏ ఉద్యోగ అనుభవంలేని గృహిణులకు సువర్ణావకాశం. సెలెక్ట్ కాబడినవారికి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగంనకు తీసుకొబడును. స్వయం ఉపాధి కలిగిన చిరువ్యాపారులు కూడా అర్హులే. ఆదాయం: 30,000/- P.M. ఇంటర్వ్యూ తేదీలు: 26th & 27th. పూర్తి బయోడేటాతో హాజరుకాగలరు. Con: శ్రీ గౌరి నేమాని. 9154574627, 9848197936.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పనిచేయుటకు *రిసెప్షనిస్ట్ (Female) *అకౌంటెంట్ *సైట్ ఇంజినీర్ మరియు మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. Contact: 7997996780.

హాస్పిటల్‌లో పనిచేయుటకు GNM, B.Sc నర్సు అనుభవం గల స్టాఫ్, 20 వేలు జీతం & వార్డు బాయ్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ స్టాఫ్, కుక్‌లు జీతం: 15 వేలు. 12 గం. డ్యూటీ. ఫుడ్, అకామిడేషన్ ఫ్రీ. RK హాస్పిటల్, కార్ఖానా, సికింద్రాబాద్. ✆ 9676532323, 9959932323.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీనందు పనిచేయుటకు 5 సం॥ అనుభవంగల * మార్కెటింగ్ ఏజెన్సీస్, * మార్కెటింగ్ సీనియర్ హెడ్స్ కావలెను. ఫోన్ నెం. 7997996780.

అనుభవం గల సేల్స్ సిబ్బంది కావలెను. భాగ్యశ్రీరామ్ జ్యూయలర్స్ స్క్వేర్ వివన హోటల్ ప్రక్కన సిరిపురం సర్కిల్, వైజాగ్. Ct: 8885697945, 6309028739.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. ✆ 96405 28899, 96406 48899.

భారతదేశంలోని అగ్రగామి సంస్థలో పనిచేయుటకు విశాఖపట్నంలో సేల్స్ ఆఫీసర్స్ & మేనేజర్స్ కావలెను. Inter/ Degree తెలుగు, ఇంగ్లీష్ వచ్చి ఉండాలి. Below 35 Yrs. ✆ 9492945063/ 9010666166.

ప్రముఖ TVS షోరూమ్ అనకాపల్లి నందు పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. ఎకౌంట్స్-2 (20,000), సేల్స్ మేనేజర్స్ -2 (20,000), సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-4 (15,000), టెలీకాలర్స్ -4 (12,000), ఇన్సెంటివ్ కూడా ఇవ్వబడును. ఆటోమొబైల్ రంగంలో ఉన్నవారికి ప్రాధాన్యత. Ph: 8341546429.

ప్రముఖ ప్రఖ్యాతిగాంచిన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీనందు క్రొత్త బ్రాంచ్‌లో వర్క్ చేయుటకు (1) సీనియర్ మేనేజర్స్- 10, (2) మేనేజర్స్ - 8, (3) ఎగ్జిక్యూటివ్స్ - 12 కావలెను. M/F, వయస్సు: 30+, గతంలో ఏదైనా సంస్థలో పనిచేసినవారు, రిటైర్డ్ ఉద్యోగులు మరియు ఫ్రెషర్స్ కూడా అర్హులే. Ph: 7095788667, 8121100599.

ఇంటి పనులు రెండు పూటలు చేసుకొని నిజాయితీగా పని చేసే ఆడ వంట పనిమనిషి కావలెను. సీతమ్మధార. 94922 33869.

Airtel DTH & XStream Fiberలో పర్క్‌చేయుటకు టెక్నీషియన్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ (F) కావలెను. ఆఫీస్: అక్కయ్యపాలెం. Ph:9000556111, 9849057276.

ఆడ వంటమనిషి, ఆడ హెల్పర్‌లు, డెలివరీ బాయ్స్ పార్ట్ లేదా ఫుల్ Time పనిచేయుటకు కావలెను. భోజనం + వసతి ఇవ్వబడును. ✆ 83748 16236.

రిటైర్డ్ ఉద్యోగులకు సువర్ణావకాశం. ప్రముఖ సంస్థలో మేనేజర్ కేడర్‌లో పనిచేయుటకు (M/F) కావలెను. అర్హులకు మంచి ప్యాకేజి కలదు. ఫుల్ / పార్ట్ టైమ్. ✆ 9441336199.

ప్రముఖ ఆఫీస్‌కి మార్కెటింగ్‌లో అనుభవం ఉన్న మార్కెటింగ్ మేనేజర్స్, సిస్టమ్ వర్క్ వచ్చిన రిసెప్షనిస్ట్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. పెందుర్తి. Ph: 7459850542.

★Wanted Fresh Graduates Male Below 25 Yrs, Fluent in English for Medical Representative Post. Package - 23,000/- per Month. ✆ 88850 20890, 98490 91550

బ్రాంచ్ Asst. మేనేజర్స్ (M), ఆఫీస్ స్టాఫ్ (కంప్యూటర్ Exp) (M), సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M), విశాఖపట్నం, గాజువాక, నర్సీపట్నం, చోడవరం, అనకాపల్లి ఏరియాలలో పనిచేయుటకు కావలెను. రాఘవ ఆటో ఫైనాన్సియర్స్, దొండపర్తి, వైజాగ్. ✆ 7680880513, 9100902198.

FACULTY/ TEACHERS

Wanted Female Home Tutor for Tutoring Inter Maths & 8th Class (CBSE) Evening 5PM. Venkojipalem, H.B.Colony. ✆ 9347046459.

గాజువాకలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు లేడీ వార్డెన్స్ కావలెను. జీతం+ ఉచిత భోజన వసతి కలదు. Ph: 9848577745, 9666694545.

MEDICAL

Medical Lab Technician, Duty Time- 6 am to 12 pm, Salary: 12000 /-, Saturday & Sunday Holiday, MVP Colony. Phone: 7288814540

SECURITY GUARDS

వైజాగ్ పోర్టులో సెక్యూరిటీగార్డులు కావలెను. అర్హత: 10th, జీతం: 12 గం॥ 15 వేలు, 8 గం॥ 12 వేలు. రూమ్, PF, ESI, RSR జడ్జి కోర్టు - జగదాంబ రోడ్, 3వ ఫ్లోర్, వైజాగ్. వాట్సాప్: 7306582829.

TOURS AND TRAVELS

కార్తీకమాసం జ్యోతిర్లింగాలు భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్, ఔండా నాగనాథ్, పరళీ వైద్యనాథ్, షిరిడి, కొల్హాపూర్, పండరీపూర్, తుల్జాపూర్ + 20 క్షేత్రములు 8 రోజులు మహారాష్ట్ర ఏసి బస్సు Nov 3 & 25 లక్ష్మీ టూర్స్. ✆ 98662 46466.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెందుర్తి

నేడు తెదేపా సభ్యత్వ నమోదు

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఐరవాడలోని జి.ఎస్. కల్యాణ మండపంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెదేపా కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ముఖ్యఅతిథిగా విచ్చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలను తక్షణమే నియంత్రించాలని సీపీఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలపై శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో చినముషిడివాడలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. అనంతరం చినముషిడివాడ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, సభ్యులు అసిరినాయుడు, ఎం.రాము, దుర్గారావు, మిన్నారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

■ శ్రీనివాసుడికి వైభవంగా తిరుమంజనం



శ్రీనివాసుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం వైభవోపేతంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేద మంత్రాల నడుమ కలియుగ దైవానికి పంచామృతాలు, ఫలోదకాలతో తిరుమంజనం నిర్వహించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

■ పశుగణనతో అన్నదాతలకు మేలు

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: అఖిల భారత 21వ పశుగణన కార్యక్రమాన్ని సబ్బవరం మండలానికి సంబంధించి గుల్లేపల్లిలో శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి పశుజాతులను నమోదు చేస్తారని పాడి రైతులు కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. పశువైద్యాధికారిణి సంధ్య మాట్లాడుతూ పశుగణన పాడి రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బండారు మంగ, బోను దేముడమ్మ, నాయకులు శ్రీను, గంగునాయుడు, పశువైద్యాధికారిణి సంధ్య పాల్గొన్నారు.



పశుగణన గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, అధికారులు

■ 27న బీచ్ రోడ్డులో లేజర్ షో

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భారత్-పాక్(1971) యుద్ధానికి సంబంధించిన దృశ్యాలతో ఈనెల 27న బీచ్ రోడ్డులోని 'విక్టరీ ఎట్ సీ' స్థూపం వద్ద లేజర్ ప్రదర్శన ఉంటుందని జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు తెలిపారు. యుద్ధ వీరుల సాహసాలతోపాటు, దేశ చరిత్ర, ఘనతలను తెలిపేలా ఇకపై ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు లేజర్ షో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అధికారుల గైర్హాజరు.. పరిష్కారం దొరకదు..



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

పెందుర్తి, న్యూస్‌టుడే

ప్రజా సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు హాజరు కాకుంటే అక్రమాలపై ఎవరిని ప్రశ్నించాలని పెందుర్తి ఎంపీపీ మదపాడ నాగమణి నిలదీశారు. పెందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గనుల శాఖ అధికారులు, తహసీల్దార్ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎంపీపీ, పంచాయతీల ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఎస్‌ఆర్‌పురంలో యథేచ్ఛగా కొండపై మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా గనుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తహసీల్దార్ హాజరుకాకుండా ఇతర అధికారులను పంపడంతో రెవెన్యూ సంబంధిత సమస్యలపై స్పష్టమైన పరిష్కారం లభించడం లేదని వాపోయారు. వచ్చే సమావేశంలో తప్పనిసరిగా అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావును ఆదేశించారు.

సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు..

★ గుర్రమ్మపాలెంలో జగనన్న కాలనీ నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదని ఎంపీటీసీ సభ్యురాలు గండ్రెడ్డి మాలతి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే కాలనీని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీని కోరారు.

★ చింతగట్ల పంచాయతీలో కొండవాలు ప్రాంతంలో 17 ఇళ్ల స్థలాలు కేటాయించారని, నిర్మాణానికి అనుకూలంగా లేదని ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు పేర్కొన్నారు. కొండ స్థలాన్ని చదును చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు అవకాశం కల్పించాలని కోరారు.

★ చింతగట్ల, జెర్రిపోతులపాలెం గ్రామాల్లో ఇటీవల పల్లె పండగ వారోత్సవాల్లో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలకు తమకు సమాచారం ఇవ్వలేదని, ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, చింతగట్ల సర్పంచి జి.వెంకటలక్ష్మి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా మరోసారి శంకుస్థాపన చేస్తామని పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మణరావుకు చెప్పారు.

★ గృహనిర్మాణ శాఖ ఏఈ దీపక్ మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ప్రజా ప్రతినిధులను కోరారు. దీనిపై జంగాలపాలెం సర్పంచి గొరపల్లి నరసింగరావు మాట్లాడుతూ తమ గ్రామంలో శ్మశానంలో స్థలాలు కేటాయించారని, కనీసం రోడ్డు కూడా లేని ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఇదే విషయంపై ప్రశ్నించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇళ్ల స్థలాల వద్దకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని అధికారులు సమాధానమిచ్చారు.

★ ఎన్‌డీబీ నిధులు విడుదల కాకపోవడం వల్ల మండలంలోని పలురోడ్ల నిర్మాణం కాకుండా నిలిచిపోయాయని ర.భ.శాఖ ఏఈ ఎం.నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

★ మండలంలోని పలు గ్రామాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి స్టాంపు డ్యూటీ జమ కాలేదని గొరపల్లి సర్పంచి గొరపల్లి శ్రీను పేర్కొన్నారు. సుమారు రూ.5 కోట్ల మేర బకాయిలను రప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ★ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, ఉప ఎంపీపీలు చిరికి దేముడు, దాడి వరలక్ష్మి, ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, ఉప తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీటీసీ సభ్యులు గండి హిమబిందు, సైపురాజు స్వప్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో ఉచిత శిక్షణ



ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: సాంకేతిక విద్య అయిన ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రహ్లాదపురం దరి శ్రీనివాసనగర్‌లోని ఎస్.వి.సొల్యూషన్స్ డైరెక్టర్ బోగిపాటి ఆదిమూర్తి తెలిపారు. సంస్థ ప్రాంగణంలో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు శ్రీనివాసనగర్‌లోని తమ కార్యాలయానికి వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉపాధికి ఉపయోగపడే ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు.

ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎస్‌వీ పవర్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఆదిమూర్తి →

అప్రెంటీస్ మేళాకు స్పందన

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి మంత్రిపాలెంలోని హైటెక్ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన అప్రెంటీస్ మేళాకు స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 117 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మేళాకు ఎంపికైన విద్యార్థుల వివరాలను త్వరలోనే ప్రకటించడంతో పాటు చరవాణికి సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు శ్రీనాథ్, కార్తికేయన్, ప్రేమ్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ అక్కిరెడ్డి దుర్గినాయుడు, నిస్ట్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



మేళాకు హాజరైన అభ్యర్థులు

ఖాళీ స్థలాల్లో మాంసం వ్యర్థాల పారబోత

వేపగుంట, న్యూస్‌టుడే: రహదారుల పక్కనున్న ఖాళీ స్థలాల్లో కొంతమంది వ్యాపారులు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా మాంసం వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు, ఉదయం నడకదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేపగుంట - గోశాల ప్రధాన రహదారిలో మాంసం దుకాణదారులు కోళ్ల వ్యర్థాలు, గొర్రె, మేక చర్మాలను పడేయడంతో అవి కుళ్లి భరించలేని వాసన వస్తోందని పరిసర ఇళ్లల్లోని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొంతమంది వేకువజామున రహదారుల పక్కన బహిరంగ మల విసర్జన చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

భాజపాలోకి వైకాపా కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్, వైకాపా నాయకుడు ముమ్మన దేముడు భాజపాలో చేరనున్నారు. చినముషిడివాడలో శనివారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సమక్షంలో భాజపా కండువా వేసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. వార్డు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ముమ్మన తెలిపారు.

తెదేపా, జనసేన నేతల అభ్యంతరం

కార్పొరేటర్ ముమ్మన దేముడు భాజపాలో చేరికపై జనసేన, తెదేపా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో కూటమి నాయకులకు వ్యతిరేకంగా పనిచేసిన ముమ్మన దేముడిని ఎలా పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి భాజపాలో చేరాలని సూచించారు. 95, 97వ వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు దాట్ల మధు, శానాపతి సోమశేఖర్ నాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు కరక దేముడు, సరిపల్లి సర్పంచి గొర్లె రామకృష్ణ ఇతర నాయకులు పాల్గొన్నారు.

'టెక్స్‌టైల్ రంగం'పై ప్రత్యేక శిక్షణ

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : టెక్స్‌టైల్ రంగంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కోర్సు ఏర్పాటు చేసినట్లు విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. శుక్రవారం దువ్వాడ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రాండిక్స్ అపెరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారి ప్రతిభ ఆధారంగా పరిశ్రమలో గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా నియమిస్తారని కార్యక్రమం కో-ఆర్డినేటర్ ఎ.నాగజ్యోతి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: జాతీయ యువజన క్రీడా విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు కారణమైన వృక్ష సంపద, వాటి పెంపకం పర్యవసానాలు గురించి వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి లీలాప్రసాదు మాట్లాడారు. యువత ఎటువంటి పద్ధతులు పాటించడం వల్ల మత్తుకు బానిస కాకుండా ఉంటారో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గణేశ్, గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీతాలక్ష్మి

బాణసంచా రవాణాపై ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: బస్సుల్లో బాణసంచా, మత్తుపదార్థాలు వంటివి అక్రమంగా రవాణా చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజా రవాణా(ఆర్టీసీ) ఇన్‌ఛార్జి అధికారి బి.అప్పలనాయుడు ఉద్యోగులకు సూచించారు. ఇన్‌ఛార్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా సింహాచలం ఆర్టీసీ డిపోను ఆయన శుక్రవారం సందర్శించారు. ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటిస్తూ, ప్రయాణికులతో స్నేహపూర్వకంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. నిషేధిత వస్తువులు తరలించే వ్యక్తులు ఆర్టీసీ సిబ్బందిపై తిరుగుబాటు చేసే ప్రమాదముందని అప్రమత్తంగా ఉంటూ వారిని పోలీసులకు ఎలా అప్పగించాలో ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా ఇన్‌ఛార్జి అధికారి బి.అప్పలనాయుడు

గ్రామసభలతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: రెవెన్యూ గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని సబ్బవరం తహసీల్దార్ చిన్నికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని లగిశెట్టిపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం భూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. మొత్తం 59 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, సర్పంచి పాలిశెట్టి పార్వతి, ఉపఎంపీపీ ఝాన్సీ లక్ష్మీరాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

నేడు పి.భోనంగిలో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగిలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న సభలో భూ సమస్యలపై అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు.

మర్యాద పూర్వక కలయిక





మంత్రులు డి.బి.వీరాంజనేయ స్వామి, కందుల దుర్గేశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో కలిశారు. అనంతరం నోవోటెల్ హోటల్‌లో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను కలిశారు. ఇరువురు మంత్రులను శాలువతో సత్కరించారు.

జనవరికి ప్రసాద్ పథకం పనులు పూర్తి చేయండి

సింహాచలం, పద్మనాభం, న్యూస్‌టుడే: సింహాచలం క్షేత్రంలో రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులు వచ్చే జనవరి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రసాద్ పథకం పనులపై శుక్రవారం సింహగిరిపై ఆయన సమీక్ష నిర్వహించారు. దేవాలయంలో చందనోత్సవం వంటి ప్రధాన ఉత్సవాలు సమీపించే నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నారు. సింహాచలం క్షేత్రానికి ఉన్న బృహత్తర ప్రణాళికకు అనుగుణంగా ఈ పనులు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇవి ఆలయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలన్నారు. యాగశాల నిర్మాణం, రామానుజ కూటము, యాంపీ థియేటర్, పుష్కరిణి సత్రం వద్ద వసతి గదులు, తదితర వాటన్నింటినీ దేవస్థానం అధికారుల సమన్వయంతో నిర్మాణం చేపట్టాలని సూచించారు. సింహగిరి బస్‌స్టాండు వద్ద పర్యాటక శాఖ సమాచార కేంద్రం నిర్మాణంపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ అభ్యంతరం వ్యక్తం చేసినా పనులు కొనసాగించడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్ష అనంతరం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతి తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. సతీ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు, దేవాదాయశాఖ సీఈలు దుర్గేశ్, శేఖర్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఈఈ కె.రమణ, ఏఈ మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు. * అనంతరం కమిషనర్ పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి ఆలయ మరమ్మతు పనులను పరిశీలించారు. దీపోత్సవం నాటికి ఈ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. గతంలో పిడుగుపాటుకు గురైన ఆలయ శిఖరాన్ని సీజీఎఫ్ నిధులు రూ.60లక్షలతో ఇక్కడ పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. చీఫ్ ఇంజినీర్ జి.వి.ఆర్.శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.సి.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.దుర్గేష్‌కుమార్, ఏసీ అన్నపూర్ణ, ఆలయ ఈవో నానాజీబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాలాపువానిపాలెంలో భారీ చోరీ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధి సాలాపువానిపాలెంలో గురువారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వి.మాడుగుల మండలం ఎం.కోడూరుకు చెందిన మైచర్ల అప్పారావు పరవాడ ఫార్మాసిటీలో కార్మికుడిగా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి సాలాపువానిపాలెంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. తమ కుమార్తె ఆధార్ కార్డు నవీకరణ నిమిత్తం భార్య పిల్లలతో కలిసి గురువారం స్వగ్రామం ఎం.కోడూరు వెళ్లారు. శుక్రవారం ఉదయం సాలాపువానిపాలెం వచ్చి ఇంటి తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఉన్న 7.5 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు, రూ.లక్ష నగదు దుండగులు అపహరించుకుపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనకాపల్లి అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు, సీఐ మల్లికార్జునరావు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



బాధితులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్న అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు

అదుపుతప్పితే అంతే సంగతులు

దర్పణం



జీవీఎంసీ 77వ వార్డు పరిధి పెదపాలెం నుంచి ఇస్లాంపేట వెళ్లే రహదారిలోని కల్వర్టుల వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో ఉన్న రెండు కల్వర్టులకు రక్షణ గోడలు లేని కారణంగా బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇక్కడ ఏమాత్రం అదుపుతప్పినా గెడ్డలో పడి భారీమూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల సమయంలో గెడ్డ ఉద్ధృతంగా ప్రవహించడంతో రోడ్డు పైనుంచి వరద పారుతుంటుందని ఆ సమయంలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పరవాడ

దారితప్పిన వృద్ధురాలు.. బంధువులకు అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే: మతిమరుపు సమస్యతో దారి తప్పిపోయి సంచరిస్తున్న ఓ వృద్ధురాలిని పెందుర్తి పోలీసులు శుక్రవారం ఆమె బంధువులకు అప్పగించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్ల కంచరపాలెం ప్రాంతానికి చెందిన రమణమ్మ(70)కు మతిమరుపు సమస్య ఉంది. ఆమె దారి మరచిపోయి వేపగుంట దరి కృష్ణరాయపురం వచ్చేసింది. స్థానిక టీచర్స్ లేఅవుట్‌లో ఆమె దిక్కుతోచక సంచరిస్తుండగా కాలనీకి చెందిన శ్రీనివాస్ డయల్ 112కి ఫోన్ చేసి సమాచారం అందించాడు. పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ ఆదేశాలపై బ్లూకోట్ కానిస్టేబుల్ ఎం.గోవిందు ఆమె వద్ద వివరాలు సేకరించి కంచరపాలెం పోలీసుల సాయంతో ఆమె బంధువులకు సమాచారం అందించారు. ఆమె బంధువులు ప్రసాద్, అజయ్‌కు వృద్ధురాలిని అప్పగించారు. పోలీసుల సహకారానికి వృద్ధురాలి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



రమణమ్మను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

రాత్రిపూట చదివేద్దాం.. డిప్లొమో కోర్సు చేసేద్దాం..

ఏగలంతా పరిశ్రమల్లో, సంస్థల్లో కష్టపడే వారికి రాత్రి వేళ చదువుకుని డిప్లొమో చేసే అవకాశాన్ని రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కల్పించింది. ఇది కేవలం వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం మాత్రమే. దీనిపై అనేక మందికి సందేహాలు ఉన్నాయి. ఏఏ కోర్సులు చేస్తే డిప్లొమా ఏ బ్రాంచిలో చేరవచ్చో చాలా మందికి అవగాహన లేదు. కోర్సు కాలపరిమితి, సమయాలు, బోధనా విధానం... ఇలాంటి సవాలక్ష సందేహాలు ముసురుకున్న వేళ వాటిని నివృత్తి చేసేందుకు 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. దీనికి పలువురు ఔత్సాహికులు ఫోన్లు చేసి తాము చదివిన కోర్సు, డిప్లొమోలో చేరడానికి గల అవకాశాల గురించి వివరాలడిగారు. వీరందరికీ ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ చక్కగా సమాధానాలు ఇచ్చారు. – కంచరపాలెం, న్యూస్‌టుడే


డాక్టర్ కె.వి.రమణ, ప్రిన్సిపల్, ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్

ప్రశ్న: ఆర్అండ్‌బి సర్కిల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నాను. డిప్లొమో చేయవచ్చా? –ఎస్.శ్రీనివాసరావు, సీతమ్మధార

జవాబు: లేదు. పరిశ్రమల్లో ఏడాది అనుభవంతో పనిచేస్తూ ఉండాలి. క్లరికల్ విభాగానికి అర్హత లేదు.

?: ఐటీఐ కార్పెంటరు ట్రేడ్ పాస్ అయ్యాను. రాత్రి కాలేజీలో చేరవచ్చా? –లావణ్యకుమార్, నేవల్ డాక్‌యార్డ్

✓: ఐటీఐ రెండేళ్ల కోర్సు చేసిన వారు అర్హులు. కార్పెంటరు ఏడాది కోర్సే. ఇంటరు ఎంపీసీ ఉన్నా పరిశ్రమల్లో ఏ విభాగంలో అనుభవం ఉందో దానికి సంబంధించిన డిప్లొమో కోర్సు చేయవచ్చు.

?: ఐటీఐ ఎలక్ట్రికల్ ట్రేడ్ చేశాను. డిప్లొమోకు అర్హత ఉందా? ఏ కళాశాలలో ఉంది? ఫీజు ఎంత కట్టాలి? –బి.సురేష్‌కుమార్, వెంకట్, జగదీష్

✓: బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ బ్రాంచి ఉంది. అక్కడకు వెళ్లి దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ ఫీజు సెమిస్టరుకు రూ.18వేలు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. రెండేళ్ల కోర్సు.

?: ఇంటర్ సీఈసీ చదివి డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్నాను. –కె.వి.దుర్గాప్రసాద్, డాక్‌యార్డ్

✓: ఇంటర్ ఆర్ట్స్ గ్రూపువారికి అవకాశం లేదు. ఎంపీసీ, బైపీసీ, కంప్యూటర్స్, ఐటీ తదితర కోర్సులు చేసిన వారు అర్హులు.

?: మెరైన్ ఇంజినీరింగ్ వర్క్‌షాపులో కార్పెంటరుగా చేస్తున్నాను.. –శ్రీనివాసరావు

✓: ఐటీఐ రెండేళ్ల కోర్సు ఉండాలి. కార్పెంటరు ఏడాది కోర్సు కాబట్టి అర్హత లేదు.

?: డిప్లొమో ఎలక్ట్రికల్ బ్రాంచ్ ఏ కళాశాలలో ఉంది? ఐటీఐలో ఎలక్ట్రికల్ ట్రేడ్ చదివాను. –దుర్గభానుతేజ, నర్సీపట్నం

✓: బెహరా ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ బ్రాంచి ఉంది. రాత్రి కళాశాలలో చేరాలంటే మీరు పనిచేస్తున్న కంపెనీకి, చేరే కళాశాలకు యాభై కిలోమీటర్ల మేర దూరం ఉండాలి. నర్సీపట్నమంటే ఎక్కువ దూరం కావచ్చు. సరిచూసుకోండి.

?: ఐటీఐలో వెల్డర్ ట్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించాను. అవకాశం ఉందా? –ఎస్.వెంకటనూక అప్పారావు

✓: వెల్డరు ట్రేడు ఒక ఏడాది కాబట్టి అవకాశం లేదు.

?: ఐటీఐ ఫిట్టరు ట్రేడ్ చేశాను. స్టీల్‌ప్లాంటులో జనరల్ ఫోర్‌మెన్‌గా చేస్తున్నాను. నాలుగేళ్లలో రిటైర్ అవుతున్నాను. డిప్లొమో చేయవచ్చా? –ఎల్.వి.ఎం.మురళీబాబు, స్టీల్‌ప్లాంటు

✓: మెకానికల్ బ్రాంచ్ చేసేందుకు మీకు అర్హత ఉంది. ఇది బెహరా కళాశాలలో ఉంది. కంప్యూటర్స్ కూడా చేయవచ్చు. ఇది రాజమండ్రిలో ఉంది. శనివారం సాయంత్రం అయిదు గంటల్లోగా ఎక్కడ చేరాలనుకుంటున్నారో అక్కడ దరఖాస్తు చేయాలి.

?: ఐటీఐ మెషినిస్టు ట్రేడ్ చేశాను. డిప్లొమో చేయవచ్చా? –ఎ.శేఖర్

✓: మెకానికల్ చేసేందుకు అర్హత ఉంది. బెహర, ప్రశాంతి కళాశాల్లో అందుబాటులో ఉంది.

?: హైదరాబాద్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్నాను, డిప్లొమో ఇక్కడ చేయవచ్చా? –సాయిచరణ్, హైదరాబాద్

✓: ఇక్కడ చేయడానికి అవకాశం లేదు.

?: ఇంటర్ ఎంపీసీ చదివాను. ప్రయివేటు కంపెనీ జీఆర్ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్నాను. – సతీష్

✓: సివిల్ డిప్లొమో చేసేందుకు అర్హులు. ప్రశాంతి ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాల అచ్యుతాపురంలో అవకాశం ఉంది.

?: ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చేశాను. సివిల్ చేయాలనుకుంటున్నాను? – సాయిశశాంక్, ఏయూ

✓: వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు మాత్రమే రాత్రి కళాశాల. మీరు వర్కింగ్ ప్రొఫెషనల్ కాకపోవడంతో డిప్లొమో చేసేందుకు అర్హత లేదు.

?: ఐటీఐ చదివి ఎ.పి.ట్రాన్స్‌కోలో చేస్తున్నాను. ఎక్కడ చేరాలి? –బి.రవి

✓: నరవలోని బెహరా కళాశాలలో ఉంది. అక్కడ దరఖాస్తు చేయండి.

?: ఐటీఐ ఫిట్టరు ట్రేడ్ చేయడంతో ప్రస్తుతం డాక్‌యార్డ్ కెమికల్ విభాగంలో పని చేస్తున్నాను. కెమికల్ ఇంజినీర్ అవ్వాలని ఉంది. దరఖాస్తు చేయవచ్చా? – ఎం.సరోజ్

✓: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో చేరవచ్చు.

?: ఇంటర్ ఒకేషనల్ వాటర్ సప్లై మేనేజ్‌మెంటు కోర్సు చదివి రుషికొండలో ఐటీ పార్కులో చేస్తున్నాను. – సత్తిబాబు, రుషికొండ

✓: మీకు కంప్యూటర్స్, సివిల్ కోర్సులు చేసేందుకు అర్హత ఉంది. సివిల్ ప్రశాంతి కళాశాలలో, కంప్యూటర్స్ రాజమండ్రిలో ఉన్నాయి.

?: ఐటీఐ ఫిట్టరు ట్రేడ్ చదివి డాక్‌యార్డ్‌లో చేస్తున్నాను. –జి.శ్రీరాములు

✓: కెమికల్ బ్రాంచ్‌లో డిప్లొమో చేసేందుకు అర్హులు.

?: రాత్రి కళాశాల ఏ సమయంలో ఉంటుంది? – ఈశ్వరప్రసాద్, భీమిలి

✓: పగటి పూట పనిచేసిన వారికి రాత్రి వేళ డిప్లొమో కోర్సు చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 9:00 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయి.

నెలాఖరు వరకు మద్యం దుకాణాల గడువు పొడిగింపు

మాధవధార, న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకున్న వ్యాపారుల ప్రొవిజినల్ లైసెన్సుల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లుగా ఉమ్మడి విశాఖ జిల్లా ఎక్సైజ్ డీసీ డి.శ్రీరామచంద్రమూర్తి తెలియజేశారు. ఈ నెల 14న నిర్వహించిన లాటరీలో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులకు ముందుగా వారం రోజులపాటు ప్రొవిజినల్ లైసెన్సులు ఇచ్చారు. అయితే ఇంకా కొన్ని చోట్ల దుకాణాల కోసం స్థల పరిశీలన, మరికొన్ని చోట్ల నిర్మాణాలు జరుగుతున్నందున ఇంకా పూర్తి స్థాయిలో కొన్ని చోట్ల శాశ్వత దుకాణాలు ఏర్పాటు కాలేదు. దీంతో పలువురు వ్యాపారుల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించినట్లుగా డీసీ తెలియజేశారు.

మూడు బ్రాండ్లలో రూ.99 మద్యం

ప్రస్తుతానికి మూడు బ్రాండ్లలో రూ.99 మద్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లుగా ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం రేషన్ ప్రకారం ఒక్కో దుకాణానికి తక్కువ సరకు ఇస్తున్నారు. అమ్మకాల ఆధారంగా పెద్ద కంపెనీలు కూడా రూ.99 మద్యం సరఫరా చేస్తే ఎలా ఉంటుందనే దానిపై కసరత్తు చేస్తున్నారు. వినియోగదారుల స్పందన చూసి ముందుకు రావాలని కొన్ని కంపెనీలు భావిస్తున్నాయి.

బాలికపై అత్యాచారం కేసులో 25ఏళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 25ఏళ్ల కారాగార శిక్షతోపాటు రూ.21వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాధితురాలికి అందించాలన్నారు. దీనికి అదనంగా రూ.4లక్షల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సాది పోలారెడ్డి(57) రెడ్డి కంచరపాలెం బూసివారివీధిలో నివసిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన దంపతులకు కుమార్తె(9) ఉంది. బాలిక ఆడుకునేందుకు నిత్యం పోలారెడ్డి ఇంటికి వెళ్లేది. 2023 ఆగస్టు 24న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఉంటుందని తల్లి భావించింది. 26వ తేదీ సాయంత్రం కుమార్తె ఇంటికి రావడంతో ఎక్కడికెళ్లావని నిలదీసింది. పోలారెడ్డి ఇంట్లో ఉన్నట్లు తెలిపింది. అనుమానంతో పదేపదే ప్రశ్నించడంతో అతను తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని పోక్సో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

ఘనంగా విశాఖ పోర్టు ఆవిర్భావ వేడుకలు


నవీకరించిన బోర్డు రూమ్‌ను ప్రారంభిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) 91వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం పోర్టు ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్ అంగముత్తు ముఖ్య అతిథిగా పాల్గొని పోర్టు పరిపాలన భవంలో నవీకరించిన బోర్డు రూమ్‌ను ప్రారంభించారు. ఉప ఛైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సుందరీకరణ, పచ్చదనం పెంపొందించే పలు ప్రాజెక్టులను శంకుస్థాపన చేశారు. పోర్టు ఛైర్మన్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ టన్నుల సరకు రవాణా చేశామని, ఈ ఏడాది 90 మిలియన్ టన్నులను లక్ష్యంగా పెట్టుకున్నామని, దీని సాధనకు ఉద్యోగులు, వ్యాపారులు సహకరించాలన్నారు. అనంతరం వివిధ సంస్థలకు సీఎస్ఆర్ చెక్కులను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేశారు. యూనియన్ నాయకులు, స్టీవ్‌డార్లు, పీపీపీ, బీఓటీ ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.

పర్యాటకులు మెచ్చేలా... ఆదాయం వచ్చేలా!

ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి

ఈనాడు, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక రంగాన్ని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విశాఖ కీర్తిని విశ్వవ్యాప్తం చేసేలా ఇక్కడి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పర్యాటకులను ఆకట్టుకుని, ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర పరిసరాల్లో ఆధ్యాత్మిక, తీర (బీచ్), క్రూయిజ్, పర్యావరణ, బౌద్ధ, చిత్ర, వైద్య పర్యాటకాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు శుక్రవారం నగరంలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విశాఖ జోన్ సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.



హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు, పర్యాటక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ శ్రీభరత్, సీఐఐ ప్రతినిధులు

రూ.29 కోట్లతో బొర్రా గుహల అభివృద్ధి: బొర్రా గుహలు, లంబసింగి తదితర ప్రాంతాలను స్వదేశీ దర్శన్-2 కింద అభివృద్ధి చేయనున్నారు. రోడ్డు నుంచి గుహల ప్రవేశ ద్వారం వరకు షాపింగ్ స్ట్రీట్‌లా తీర్చిదిద్దడంతో పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బొర్రా గుహల అభివృద్ధికి రూ.29 కోట్లు మంజూరయ్యాయి. వాటితో దశల వారీగా అభివృద్ధి పనులు చేయనున్నారు. అరకు, అనంతగిరిలోని పర్యాటక అతిథి గృహాలను ప్రైవేటుకు దీటుగా ఆధునికీకరణ చేపట్టనున్నారు. నగరంలో యాత్రి నివాస్ సహా రాష్ట్రంలో 18 రిసార్ట్‌ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నారు. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలనుకుంటున్నారు.

పర్యాటకంపై శ్వేతపత్రం: రామకృష్ణ బీచ్ నుంచి భీమిలికి బస్సు సదుపాయం, శనివారం సాయంత్రాల్లో బీచ్‌లో డ్రోన్ షో ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని సీఐఐ విజ్ఞప్తి చేసింది. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా జేఎల్ఎల్ సంస్థ తయారుచేసిన విశాఖలో పర్యాటక రంగంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు.

అనుమతులకు ఏక గవాక్ష విధానం: విశాఖలో సినిమాల చిత్రీకరణలకు అనుమతులు ఇచ్చేందుకు ఏకగవాక్ష విధానం ఏర్పాటు చేయాలని సినీ పరిశ్రమ ప్రతినిధులు కోరుతున్నారు. వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం పర్యాటక పాలసీని తయారు చేయనుంది. తెన్నేటి పార్కుకు సమీపంలో ఉన్న 'ఎంవీ మా నౌక'తోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధికి అటవీ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అలాంటి ప్రాజెక్టుల వివరాలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించనున్నారు.

క్రూయిజ్ హబ్‌గా: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తించగా.. 'నీతిఆయోగ్ గ్రోత్ హబ్' జాబితాలో దక్షిణ భారతదేశంలో విశాఖకు చోటుదక్కింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పర్యాటకపరంగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోనున్నారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి నుంచి శ్రీలంక, చెన్నై, పుదుచ్చేరి ప్రాంతాలకు లగ్జరీ క్రూయిజ్‌లు ఏర్పాటుచేసి, క్రూయిజ్ టూరిజం అభివృద్ధి చేయనున్నారు.

సదుపాయాల మెరుగుపై ప్రత్యేక దృష్టి: నగరంలో వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపరుస్తాం. త్వరలో హాస్పిటాలిటీ శిక్షణ సంస్థలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటాం. హోటళ్ల పని వేళలను అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించడంతోపాటు నగరాన్ని పర్యాటకులకు అనుకూలంగా తీర్చిదిద్దడానికి వీధిదీపాలు, రవాణా సదుపాయాల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాం' అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

'కోడికత్తి' కేసుకు ఆరేళ్లు

ఈనాడు–విశాఖపట్నం

రాష్ట్రంలో సంచలనం రేపిన 'కోడికత్తి' ఘటన విశాఖ విమానాశ్రమంలో జరిగి ఆరేళ్లవుతోంది. ఓ పెద్ద హైడ్రామాగా మారిన ఈ కేసును వైకాపా 2019 ఎన్నికల్లో ప్రచారాంశంగా మార్చుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న జనపల్లి శ్రీను విచారణ ఖైదీగా జైల్లో మగ్గి బెయిల్‌పై బయటకు వచ్చారు. ప్రస్తుతం రెగ్యులర్ వాయిదాలకు విశాఖ ఎన్ఐఏ కోర్టుకు హాజరవుతున్నారు. ఈ కేసు నవంబరు 15కు వాయిదా పడింది. విచిత్రమేమంటే ఈ కేసులో బాధితుడుగా ఉన్న మాజీ సీఎం జగన్ ఒక్కసారి కూడా న్యాయస్థానంలో విచారణకు హాజరు కాకపోవడం.

ఏం జరిగిందంటే?: జగన్ 2018 అక్టోబర్ 25న హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ విమానాశ్రయానికి వచ్చారు. వీఐపీ లాంజ్‌లో ఉండగా సెల్ఫీ తీసుకుంటానంటూ జనపల్లి శ్రీను వచ్చి, కోడి కత్తితో దాడి చేశారంటూ వైకాపా నాయకులు హడావుడి చేశారు. భుజానికి చిన్న గాయం అయిందంటూ వెంటనే విమానంలో హైదరాబాద్ వెళ్లిన జగన్, అక్కడ లోటస్ పాండ్‌కు దగ్గరగా ఉన్న ఓ ఆసుపత్రిలో చేరారు. అయితే శ్రీను జగన్ వీరాభిమాని అని, జగన్‌పై సానుభూతి రావాలనే దాడి చేసినట్లు అప్పట్లో పోలీసులు తేల్చారు.

ఎన్నో మలుపుల మధ్య విశాఖకు చేరిన కేసు: ఈ కేసుపై దర్యాప్తునకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసింది. ఏపీ పోలీసులపై తనకు నమ్మకం లేదని జగన్ ఎన్ఐఏ విచారణ చేయాలని కోరారు. 2019లో ఎన్ఐఏ ఛార్జిషీటు దాఖలు చేసినా విచారణకు వచ్చేందుకు జాప్యమైంది. జనపల్లి శ్రీనుకు 2019 మే 22న బెయిల్ రాగా, ఆగస్టు 13న మళ్లీ జైలుకు సరెండర్ అయ్యారు. కారణం ఆ బెయిల్‌ను ఎన్ఐఏ...న్యాయస్థానంలో కొట్టివేయించడమే. అప్పటి నుంచి బెయిల్ పిటిషన్‌పై విజయవాడ న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్నాయి. కోడికత్తి కేసును అనూహ్యంగా విజయవాడ నుంచి 2023 ఆగస్టు 30న విశాఖ ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేశారు. అదే సమయంలో రాజమహేంద్రవరం కారాగారం నుంచి విశాఖ న్యాయస్థానానికి రావడానికి ఇబ్బందులున్నాయని, విశాఖ కేంద్ర కారాగారానికి శ్రీనును మార్చాలంటూ నిందితుడి తరపు న్యాయవాది కోరడంతో కోర్టు అంగీకరించింది. 2023 సెప్టెంబరు నుంచి శ్రీను విశాఖ కేంద్ర కారాగారంలో మగ్గుతూ, 2024 ఫిబ్రవరిలో బెయిల్‌పై బయటకు వచ్చారు.

లోతైన దర్యాప్తు కావాలంటూ: కోడికత్తి కేసులో లోతైన దర్యాప్తు కావాలని, అదేవిధంగా వీడియోకాల్ ద్వారా కోర్టు విచారణకు అనుమతివ్వాలంటూ జగన్ తరపు న్యాయవాదులు పిటిషన్లు వేశారు. ఇందులో లోతైన దర్యాప్తు అనే అంశంపై పిటిషన్‌ను విశాఖ కోర్టు కొట్టేసింది. మరో పిటిషన్ పెండింగ్ ఉండగానే, మళ్లీ జగన్ లోతైన దర్యాప్తు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించడంతో 8 వారాలు ఎన్ఐఏ కోర్టులో ప్రొసిండింగ్స్‌పై స్టే ఇచ్చింది. వచ్చే నెల 15న లోతైన దర్యాప్తుపై వేసిన పిటిషన్ హైకోర్టులో విచారణకు రానుంది.

'రావాలి జగన్..చెప్పాలి సాక్ష్యం.. అనేదే మా నినాదం. న్యాయస్థానంకు జగన్‌కు వస్తే నిజానిజాలు వస్తాయి. ఓపెన్ కోర్టులో సీన్ రీక్రియేషన్ చేసి జగన్ వాంగ్మూలం రికార్డు చేయాలనేది మా డిమాండ్' అని శ్రీను తరపు న్యాయవాది పేర్కొంటున్నారు.


జ్ఞానాపురం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం జరిగిన యువజనోత్సవాల్లో శాస్త్రీయ నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు


బృంద నృత్యంలో ఆకట్టుకునేలా హావభావాలు.. – జ్ఞానాపురం, న్యూస్‌టుడే

'విశాఖ డెయిరీ'పై భీమిలి ఆర్డీవో విచారణ


వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్


విచారణకు హాజరైన విశాఖ డెయిరీ యాజమాన్య ప్రతినిధి

గ్రామీణభీమిలి (విశాఖపట్నం), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యం అత్యంత ఖరీదైన భూములను ఆక్రమించారనే ఆరోపణపై భీమునిపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో సంగీత్ మాథుర్ విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఆ సంస్థ జనరల్ మేనేజరు విద్యారావు యాజమాన్యం తరపున హాజరయ్యారు. విశాఖ గ్రామీణ మండల పరిధిలో దాదాపు 7.02 ఎకరాల ప్రభుత్వ భూమిని విశాఖ డెయిరీ ఆక్రమించినట్లు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇటీవల విశాఖ జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక విచారణ చేపట్టిన రెవెన్యూ యంత్రాంగం డెయిరీ యాజమాన్యానికి, పశు సంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులకు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లకు నోటీసులు పంపి శుక్రవారం ఉదయం విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. డెయిరీ యాజమాన్య ప్రతినిధులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను సమర్పించగా, పశు సంవర్ధకశాఖ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) అధికారులు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. దీనిపై తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దీనిపై క్షేత్రస్థాయిలో లోతుగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అనంతరం చట్టప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.

హనీట్రాప్ కేసులో జాయ్ జెమీయాకు ముగిసిన కస్టడీ

మాధవధార, న్యూస్‌టుడే: హనీట్రాప్ కేసులో నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీయాను గత రెండు రోజులుగా కస్టడీకి తీసుకొని విచారించిన కంచరపాలెం పోలీసులు, శుక్రవారం విచారణ ముగియడంతో మళ్లీ ఆమెను జైలుకు తరలించారు. ఈ వ్యవహారంలో ఈమెతో పాటు ఒక ముఠా ఉందని, వారి సూచనల మేరకే ఆమె పలువురిని మోసం చేసినట్లుగా తెలుస్తోంది. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ధనవంతులను ఎంపిక చేసుకుని, వారిని మోసం చేసి, వేధింపులకు గురి చేసి నగదు దోచుకున్నట్లుగా పలువురు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తెలుస్తోంది.

'విద్యుత్తు బకాయిలు చెల్లించాల్సిందే..'

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించిన విద్యుత్తు బకాయిలు చెల్లించకపోతే ఈనెల 27న కనెక్షన్ తొలగిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఉక్కు యాజమాన్యానికి ఓ లేఖ పంపారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి సుమారు రూ.70 కోట్లు బకాయి ఉండగా, ఈనెలలో రూ.26 కోట్లు చెల్లించారని, మిగిలిన రూ.44 కోట్లు వెంటనే చెల్లించకపోతే.. 27 సాయంత్రంలోపు నోటీసు ఇవ్వకుండానే సరఫరా నిలిపేస్తామని స్పష్టం చేశారు

రేషన్ సరకులు దారి మళ్లిస్తే కేసులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలు, ఎల్ఎల్ఎస్ (నిల్వ కేంద్రాలు) పాయింట్లలో తనిఖీలు చేపట్టి అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జేసీ మయూర్ అశోక్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, తనిఖీ అధికారులను ఆదేశించారు. రేషను సరకులను దారి మళ్లించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం ఉదయం ఆయన పౌరసరఫరాల శాఖ అధికారులు, తనిఖీ అధికారులతో మాట్లాడారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలత, ఏఎస్ఓ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి'కి షిప్‌యార్డు ముందడుగు


గ్రీన్ ఎనర్జీ బ్యాటరీల ఉత్పత్తి టెక్నాలజీ నమూనా

గాజువాక, న్యూస్‌టుడే : భారత గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ అయిన విశాఖపట్నం హిందుస్థాన్ షిప్ యార్డు (హెచ్ఎస్ఎల్) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ముందడుగు వేసింది. సముద్రంలో ఉపయోగించే పరికరాలకు అవసరమైన గ్రీన్ ఎనర్జీ బ్యాటరీల ఉత్పత్తి సాంకేతికతను షిప్ యార్డు సిద్ధం చేసింది. కొరియన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అసోసియేట్, లోటస్ వైర్‌లెస్ ప్రైవేటు సంస్థతో కలిసి దీన్ని తయారు చేసింది. దేశ సముద్ర రంగానికి అత్యాధునిక హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీని పరిచయం చేసేందుకు ఇది తోడ్పడుతుందని హెచ్ఎస్ఎల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. పూర్తి సురక్షితంగా వివిధ సముద్ర ఉపకరణాలకు సరిపోయేలా సిద్ధం చేసుకునే అవకాశం ఉందని వివరించింది. డీజిల్‌తో నడిచే వ్యవస్థలకు స్థిరమైన ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్ పని చేస్తుందని పేర్కొంది. సముద్ర పరికరాలకు, వాటి అవసరాలకు సరిపోయేలా గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తికి అవసరమైన సాంకేతికతను అందిస్తామని షిప్ యార్డు వెల్లడించింది.

నేడు పారిశ్రామికవేత్తల సదస్సు

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : విశాఖ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజస్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆటోనగర్ వాసీ సమావేశ మందిరంలో పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని సంఘ అధ్యక్షులు ఎన్.ప్రశాంత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఐఐసీ, ఎమ్ఎస్ఎమ్ఈ, ఎన్ఎస్ఐసీ, ఎన్ఆర్‌డీసీ, ఎస్‌బీఐ, డీఎల్‌సీ సహకారంతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఏవీ.పటేల్ హాజరవుతారని, పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు, రేపు ఓజీఎస్‌వీ వార్షిక సీఎంఈ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ అబ్‌స్ట్రిక్స్, గైనకాలజికల్ సొసైటీ (ఓజీఎస్‌వీ) 58వ వార్షిక సీఎంఈ (నిరంతర వైద్య విద్యా కార్యక్రమం)ని ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఓజీఎస్‌వీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వైఎల్ నర్సింగరావు, డాక్టర్ జి.కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్య రంగానికి సంబంధించిన అంశాలపై చర్చిస్తామన్నారు.

నేటి నుంచి రంజీ మ్యాచ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆంధ్ర-హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా రెండు జట్ల క్రికెటర్లు శుక్రవారం స్టేడియం 'బి' మైదానంలోని నెట్స్ వద్ద సాధన చేశారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో శ్రమించారు. అంతకు ముందు స్టేడియం వ్యాయామశాలలో కసరత్తులు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల గంటల వరకు మ్యాచ్ జరుగుతుంది. ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించారు

విశాఖ ఖ్యాతిని పెంచేలా ప్రణాళికలు

సమీక్షలో ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నగర ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దాదాపు 4గంటల సేపు ఈ సమీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి అమలు చేయాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.

భోగాపురం విమానాశ్రయానికి 45నిమిషాల్లో చేరుకోవాలి

సమీక్ష సమావేశంలో, తదుపరి మీడియాతో ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి 45 నిమిషాల్లో చేరుకొనేలా రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. లంకెలపాలెం నుంచి భోగాపురం వరకు 12 కూడళ్లు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఆయా చోట్ల పైవంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి 16ని విస్తరించడం, లేదా బీచ్ రోడ్డును భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేయడంపై సమావేశంలో చర్చించారు. దీనికి సంబంధించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రజాప్రతినిధులు తిలకించారు. నగర బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)కు సంబంధించి వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సీపీ శంఖబ్రత బాగ్చీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు

విభిన్న ప్రతిభావంతులకు క్రీడా మైదానం

నగరంలో కాలుష్య నివారణ చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. పంచగ్రామాల భూసమస్యను కొలిక్కి తేవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జీవీఎంసీ పరిధిలో 100శాతం యూజీడీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీని కోసం రూ.200కోట్లు కేటాయించామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఫీజుల విషయంలో విద్యార్థులను విద్యా సంస్థల నిర్వాహకులు ఇబ్బంది పెట్టరాదన్నారు. ధ్రువపత్రాలు వారి వద్ద ఉంచుకోవడం చట్ట విరుద్ధమన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రస్తావించిన అంశాలు ఇలా..

గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కన్వేన్షన్ డీడ్‌లు, 22ఏ భూముల విషయంలో సడలింపు ఇవ్వాలన్నారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతోపాటు జెట్టీ నిర్మాణం చేపట్టాలన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సదరం స్లాట్ల బుకింగ్‌లో ఇబ్బందులను తొలగించాలన్నారు. నగరంలో హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. ప్రజాప్రతినిధుల వినతులను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు కోరారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పగటిపూట చేపట్టరాదని, జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని సూచించారు.


★ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీసీపీ అజిత, డీఆర్వో కె.మోహన్‌కుమార్, విశాఖ, భీమిలి ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు, తల్లిదండ్రులు, పోషణ, సంక్షేమ చట్టం కరపత్రాలను విడుదల చేశారు.

భీమిలి

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ పి.శ్రీవాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా శ్రీవాణి

విజయనగరం జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఈమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా రెండు నెలలు పని చేసిన శ్రీనివాసులు తిరిగి ఆయన స్వస్థలమైన అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.



తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్సు ఆఖరి సంవత్సరం చదువుతున్న మేడిశెట్టి చైతన్యసాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ తెలిపారు. ఈ నెల 23న విజయనగరంలోని ఎం.వి.జి.ఆర్. కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల తైక్వాండో పోటీల్లో చైతన్యసాయి స్వర్ణపతకం సాధించి వచ్చే నెల 6 నుంచి అమృత్‌సర్‌లో జరగనున్న ఆలిండియా అంతర వర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంబంధిత విద్యార్థిని ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ కొండపై గల శ్రీమహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

27న బీచ్ రోడ్డులో లేజర్ షో

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భారత్-పాక్(1971) యుద్ధానికి సంబంధించిన దృశ్యాలతో ఈనెల 27న బీచ్ రోడ్డులోని 'విక్టరీ ఎట్ సీ' స్తూపం వద్ద లేజర్ ప్రదర్శన ఉంటుందని జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు తెలిపారు. యుద్ధ వీరుల సాహసాలతో పాటు, దేశ చరిత్ర, ఘనతలను తెలిపేలా ఇకపై ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు లేజర్ షో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



రేఖవానిపాలెంలో ఉచిత వైద్యశిబిరం

తగరపువలస, న్యూస్‌టుడే: అవంతి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో భీమిలి-తగరపువలస రోడ్డులోని రేఖవానిపాలెం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబీవీ రాజు, సర్పంచి సమ్మిడి శ్రీనివాసరావు ప్రారంభించారు. వైద్యులు సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జనవరి నాటికి ప్రసాద్ పథకం పనులు పూర్తి చేయాలి

సింహాచలం, పద్మనాభం, న్యూస్‌టుడే: సింహాచలం క్షేత్రంలో రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులు వచ్చే జనవరి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రసాద్ పథకం పనులపై శుక్రవారం సింహగిరిపై ఆయన సమీక్ష నిర్వహించారు. దేవాలయంలో చందనోత్సవం వంటి ప్రధాన ఉత్సవాలు సమీపించే నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నారు. సింహాచలం క్షేత్రానికి ఉన్న బృహత్తర ప్రణాళికకు అనుగుణంగా ఈ పనులు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇవి ఆలయ సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలన్నారు. యాగశాల నిర్మాణం, రామానుజ కూటము, యాంపీ థియేటర్, పుష్కరిణి సత్రం వద్ద వసతి గదులు, తదితర వాటన్నింటినీ దేవస్థానం అధికారుల సమన్వయంతో నిర్మాణం చేపట్టాలని సూచించారు. సింహగిరి బస్‌స్టాండు వద్ద పర్యాటక శాఖ సమాచార కేంద్రం నిర్మాణంపై రాష్ట్ర దేవాదాయశాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ అభ్యంతరం వ్యక్తం చేసినా పనులు కొనసాగించడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్ష అనంతరం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతి తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. సతీ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు, దేవాదాయశాఖ సీఈలు దుర్గేష్, శేఖర్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, పర్యాటక శాఖ ఈఈ కె.రమణ, ఏఈ మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.



దేవస్థానం, పర్యాటక శాఖ అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ



పద్మనాభంలోని అనంతుడి ఆలయ మరమ్మతు పనుల పురోగతిపై ఆరా తీస్తున్న కమిషనర్ సత్యనారాయణ

★ అనంతరం కమిషనర్ పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి ఆలయ మరమ్మతు పనులను పరిశీలించారు. దీపోత్సవం నాటికి ఈ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. గతంలో పిడుగుపాటుకు గురైన ఆలయ శిఖరాన్ని సీజీఎఫ్ నిధులు రూ.60లక్షలతో ఇక్కడ పనులు చేపడుతున్న సంగతి తెలిసిందే. చీఫ్ ఇంజినీర్ జి.వి.ఆర్.శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.సి.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.దుర్గేష్‌కుమార్, ఏసీ అన్నపూర్ణ, ఆలయ ఈవో నానాజీబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

పద్మనాభం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ కె.ఆనందరావు పేర్కొన్నారు. కృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆక్రమణకు గురైన భూముల్లో హెచ్చరిక బోర్డులు పెట్టించడం, న్యాయపరమైన పోరాటం సాగించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సిబ్బందికి ఆదేశించారు. రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పరిశీలించారు. వి.ఆర్.ఒ రవి తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్య పరిష్కరించాలంటూ వినతి

సింహాచలం, న్యూస్‌టుడే: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల కాలనీ అసోసియేషన్లు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచగ్రామాల భూముల కమిటీ ప్రతినిధులు విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నివాసంలో కలిసిన కమిటీ సభ్యులు భూసమస్యపై ఎమ్మెల్యేకు వివరించారు. కమిటీ ప్రతినిధులు కృష్ణంరాజు, ప్రతాప్, బి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం




విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.


















భీమిలి

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస అవంతి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు ఈ వేడుకలను ప్రారంభించారు. అవంతి విద్యా సంస్థల

ఉల్లాసంగా...ఉత్సాహంగా


ఛైర్మన్, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.
















విద్యార్థులకు అవగాహన


సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరగడంతో వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడుతుందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సైబర్ సెక్యూరిటీ నిపుణులు మౌనిక సత్తూర్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో 'సైబర్ నేరాలపై' శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార భద్రత వంటివి తెలియజేశారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ఆచార్య కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించాలన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, డాక్టర్ గురుప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన పట్టణ ప్రణాళిక విభాగం

- జోన్-2లో ఏసీపీ తప్ప మిగతా అధికారులేరీ..
- అనుమతి లేని కట్టడాలపై పర్యవేక్షణ కరవు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారుల కొరత వల్ల అనధికారిక కట్టడాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఈ పరిస్థితుల్లో సచివాలయాల సిబ్బందిపై ఆధారపడడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విభాగంలో ఓ ఏసీపీ, నలుగురు టీపీవోలు, ఇద్దరు టీపీఎస్‌లు, ముగ్గురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సిన చోట ఒక్క ఏసీపీతోనే నడుస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

★ 128 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ జోన్ పరిధిలో 5 నుంచి 13 వార్డుల్లో 1,06,890 గృహాలు ఉండగా 2,67,918 మంది జనాభా నివసిస్తున్నారు. వార్డుల్లో వందలాది ఇళ్లు, బహుళ అంతస్థు నిర్మాణాలు సాగుతున్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులు లేరు. అనధికార కట్టడాలు తదితర వాటికి సంబంధించి న్యాయస్థానాల్లో 238 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కోర్టుల్లో విచారణకు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు వెల్లువ..

అధికారులు లేక సచివాలయ సిబ్బందితోనే దస్త్రాల నిర్వహణ పనులు

జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో ఈ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులే అధికం. ఆ సమయంలో ఆ శాఖకు చెందిన అధికారులు లేక ఫిర్యాదుదారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మాణాలు, రహదారులను ఆక్రమించి బడ్డీల ఏర్పాటు, కాలువల ఆక్రమణ, అనుమతి లేకుండా అదనపు అంతస్తుల కట్టడాలు, క్లినిక్‌ల పేరిట వాణిజ్య దుకాణాల నిర్వహణ, పార్కులను ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించడం తదితర ఫిర్యాదులు అధికంగా ఉంటున్నాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించాల్సిన వారు లేక ఆ శాఖ విమర్శలకు గురవుతోంది.

ఈ జోన్‌లోని 91 సచివాలయాల్లో 62 మంది ప్రణాళిక కార్యదర్శులు ఉన్నారు. కొన్ని చోట్ల ఈ పోస్టులు భర్తీ కాక ఉన్న సిబ్బందిలో కొందరికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. వీరు అక్రమ నిర్మాణాలు గుర్తించి అనాథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఐడెంటిఫికేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (యూసీఐఎంఎస్) యాప్‌లో వెంటనే అప్‌లోడ్ చేసి తాఖీదులివ్వాలి. తర్వాత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని కూల్చివేయాల్సి ఉన్నా అవేవీ జరగడం లేదనే విమర్శలున్నాయి. వీరిలో కొందరు స్థానిక నాయకులతో కలిసి 'అన్నీ తామై' వ్యవహారాలు చక్కబెడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

గత గుత్తేదారుడికి రూ.లక్షల్లో బకాయి..

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో రహదారుల పక్కన బడ్డీలు తొలగించాలన్నా, అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలన్నా తొలగింపుల బృందం ఉండేది. ఆ పనులు చేపట్టే గుత్తేదారుడికి రూ.లక్షల్లో బిల్లుల బకాయి ఉండడంతో ప్రస్తుతం ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దాంతో ఎక్కడైనా ఆక్రమణలు తొలగించాలంటే రోజువారీ కూలీలను తీసుకువచ్చి మమ అనిపిస్తున్నారు.

అందుబాటులో ఉన్న సిబ్బందితోనే నిర్వహణ..



మా విభాగంలో ఖాళీల భర్తీకి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం సచివాలయాల్లో ఉన్న ప్లానింగ్ సెక్రటరీలతో విధులు నిర్వర్తిస్తున్నాం. అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు జారీ చేశాక వాటిని కూల్చివేస్తున్నాం. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టినా, తాఖీదులు తీసుకుని మొండిగా కట్టడాలు కొనసాగించినా చర్యలు తప్పవు.

-ఎస్.శాస్త్రి శబ్నాన్, ఏసీపీ, జోన్-2.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



పీఎంపాలెం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మధురవాడ పోలాక్స్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభ పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు చేపట్టారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సీఐ నల్లి సాయి, ఎస్సై జి.ప్రసాద్ తదితరులు బహుమతులు అందజేశారు.

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: మారుతీనగర్ (పెదరుషికొండ) జ్యూయల్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో వీధి దీపాలు వెలగక నిత్యం అంధకారం నెలకొంటోంది.
-స్థానికులు, రుషికొండ

సమాధానం: వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. -సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: వైఎస్సార్ లేఅవుట్ (ఎండాడ)లో పగటి పూట కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి.
-స్థానికులు, వైఎస్సార్ లేఅవుట్

సమాధానం: పగటిపూట వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. -సురేష్, విద్యుత్ ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: ఆరోగ్య పరిధి పీఎంపాలెం సాయిప్రియా గార్డెన్స్ ప్లాట్ నంబరు ఎంఐజీ-40 పరిసరాల్లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. -స్థానికులు, పీఎంపాలెం

సమాధానం: కాలువల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.
-సీతారాం, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

27న అంకోసాలో 'సాలూరు' సినీ సంగీత విభావరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ రసజ్ఞ వేదిక, అంకోసా (ఆంధ్ర వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న సాలూరు రాజేశ్వరరావు స్వరపరిచిన గీతాలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అంకోసా సమావేశ మందిరంలో నవీన్, ఏఎస్ జాన్ బృందం ఆధ్వర్యంలో ఈ విభావరి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రచయిత సుహాసిని ఆనంద్ రచించిన సాలూరు రాజేశ్వరరావు సినీ సంగీత సౌరభం పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు. ప్రముఖ గాయకులు పాలగుమ్మి రాజగోపాల్, సెంచూరియన్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు, అంకోసా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, డాక్టర్ పి.సుధాకర్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

వీఆర్‌కు నార్త్‌జోన్ ట్రాఫిక్ సీఐ



ఎస్.కాంతారావు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం నార్త్‌జోన్ ట్రాఫిక్ సీఐ ఎస్.కాంతారావు వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు సరెండర్ అయ్యారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఇక్కడ సీఐగా విధుల్లో చేరిన ఆయన వైకాపా అధికారిగా ముద్ర వేసుకున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో నియోజకవర్గ వైకాపా నాయకులకు మద్దతుగా నిలిచారు. మధురవాడ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ విషయంలో పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా కారుషెడ్డు, కొమ్మాది కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పరిష్కార చర్యలు చేపట్టలేదు. పీఎంపాలెం స్టేషన్ పరిధి నుంచి గతంలో బదిలీపై వెళ్లిన నార్త్‌జోన్ ఏసీపీ బి.సునీల్, పీఎంపాలెం శాంతిభద్రతల విభాగం సీఐ వై.రామకృష్ణ, తాజాగా ట్రాఫిక్ సీఐ కాంతారావు కూడా వీఆర్‌కు సరెండర్ కావాల్సి వచ్చింది. వీరంతా వైకాపాకు అనుకూలంగా వ్యవహరించడం ప్రధాన కారణం కావచ్చుననే సందేహాలు ప్రజల్లో బలంగా వెలువెత్తుతున్నాయి.

గీతంలో ముగిసిన సదస్సు

సాగర్‌నగర్: ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణలు, భద్రత అంశాలపై గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(ఢిల్లీ) సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ (తైవాన్) సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. తైవాన్ చిన్నదేశం అయినప్పటికీ విద్య, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో ప్రపంచంలో అగ్రస్థానంలో ఉందని ఆ దేశ ప్రతినిధి రాబర్ట్‌హెచ్ వివరించారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (ఢిల్లీ) వీసీ ఆచార్య శాంతిశ్రీ ధూలిపూడి పండిట్, అల్కా ఆచార్య, ఎస్.సుష్మరాజ్, డాక్టర్ ఎం.వి.కులకర్ణి, ఆచార్య బి.నళిని, కె.దీప కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహక ప్రతినిధుల్ని వక్తలు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



విద్యాలయాల సమీపంలో మద్యం దుకాణమా..?

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వవార్డు కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రహదారిలో ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే మలుపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేశారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణం సమీపంలో రెండు ప్రయివేటు పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయని, పరిసరాల్లో వందల్లో బహుళ అంతస్థు భవనాలున్నాయని, వందలాది మంది మహిళలు, వృద్ధులు అదే మార్గంలో ఉదయం, సాయంత్రం నడకకు రాకపోకలు చేస్తారని అంటున్నారు. ఇలాంటి చోట మద్యం దుకాణం ఏర్పాటు తగదని మండిపడుతున్నారు. దీనివల్ల రాత్రికి రాత్రే అనధికారిక బడ్డీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటయ్యాయని వీటి కారణంగా మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రుషికొండ కూడలిలో ఈ-పోలీసింగ్ కేంద్రం



కేంద్రం వద్ద విధుల్లో ఉన్న పోలీసు

సాగర్‌నగర్, పీఎం పాలెం, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డులో చిన రుషికొండ కూడలి వద్ద రెండేళ్లుగా మూతపడిన 'ఈ-పోలీసింగ్ కేంద్రం' శుక్రవారం తెరుచుకుంది. సంబంధిత ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కూడలిలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఇటీవల స్థానికులు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి విన్నవించారు. దీంతో ఆయన స్పందించి ఇక్కడ 24 గంటలు విధుల్లో ఉండేలా సిబ్బందిని నియమించాలని పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణను ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం నుంచి సంబంధిత పోలీసు కేంద్రం వద్ద రాత్రి, పగలు విధులు చేపట్టేందుకు ముగ్గురు సిబ్బందిని నియమించారు.

కారుషెడ్డు కూడలిలో రద్దీ నియంత్రణ చర్యలు



సేవామార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: కారుషెడ్డు కూడలిలో ట్రాఫిక్ సమస్యలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నగర సీపీ శంఖబ్రత బాగ్చీ శుక్రవారం సాయంత్రం కూడలి పరిసరాలు, సేవా మార్గాలను పరిశీలించారు. కారుషెడ్డు కూడలి నుంచి మిధిలాపురి వుడా కాలనీ రోడ్డు ప్రారంభం వరకు ఉన్న సేవామార్గం మధ్యలో నియంత్రికలు ఏర్పాటు చేసి రెండు మార్గాలుగా విభజించాలన్నారు. వుడాకాలనీ కూడలిలో పోలీసు సిబ్బందిని నియమించాలని, రద్దీ ప్రాంతంలోని ఆటోస్టాండ్‌ను వేరే చోటికి మార్చుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డీమార్ట్ వద్ద కాలిబాటపై ఎవరూ వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, నార్త్‌జోన్ ట్రాఫిక్ సీఐ నల్లి సాయి, పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్సై జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఆయుధాల ప్రదర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొమ్మాది, న్యూస్‌టుడే: అమర వీరులు, పోలీసుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ సారథ్యంలో ఆయుధాల ప్రదర్శన చేపట్టారు. వాటి పనితీరుపై వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు, అతిథులుగా విచ్చేసిన భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాథుర్ తదితరులకు అవగాహన కల్పించారు. అంతేకాక విపత్తుల సమయంలో బాధితులను ఏ విధంగా రక్షించాలి, ఈ పరికరాలు ఏ విధంగా పని చేస్తాయి.. తదితరాలపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు సైతం నిర్వహించారు. సహాయ కమాండెంట్ పి.సత్యం, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చండి

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలని వార్డుల్లో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ సూచించారు. జీవీఎంసీ జోన్-2 కార్యాలయ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. అందరూ నార సంచులే వాడేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తపన్ను వసూలు చేయకూడదని అన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● భీమిలిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి పాసైన పేద విద్యార్థినుల కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభించారు. ఈమేరకు శుక్రవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో తొలి విడతగా 40 మంది విద్యార్థినులు చేరారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు ఎం.ఎస్.ఆఫీస్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల విద్యార్థినులు ఇందులో చేరాలంటే 96432 22666 నంబరుకు ఫోనులో సంప్రదించాలని ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామ్ కోరారు.

● నేడు తెదేపా సభ్యత్వ నమోదు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం భీమిలిలోని తన విడిది కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

● మహిళల ఆరోగ్యంపై అవగాహన

మధురవాడ, న్యూస్‌టుడే: మహిళలు ఆరోగ్యం పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని పినాకిల్ ఆసుపత్రి క్లినికల్ న్యూట్రిషన్ ఫరీదా సుల్తానా అన్నారు. మధురవాడలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(సిమ్స్) కళాశాలలో 'మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాలతో కూడిన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, స్వీయ సంరక్షణ తదితరాలపై అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, నోడల్ అధికారి జి.సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో డైరెక్టర్ వి.సాయిప్రశాంత్, ప్రిన్సిపల్ డాక్టర్ యు.లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన ప్రారంభం

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అఖిలభారత 21వ పశుగణన కార్యక్రమం భీమిలి మండలం కృష్ణరాజుపేటలో శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఛైర్మన్ గాడు వెంకటప్పడు ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశు గణనతో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కిరణ్, సర్పంచి గాడు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ★ తాళ్లవలసలో తెదేపా ఎమ్పీటీసీ సభ్యుడు కోరాడ రమణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాళ్లవలస పశువైద్యకేంద్రం డాక్టర్ జి.ప్రశాంతి మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకూ జరిగే పశుగణనకు పాడి రైతులు సహకరించాలన్నారు.

శారదా పీఠం భూముల స్వాధీనాన్ని స్వాగతిస్తున్నాం: సీపీఐ

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి మండలం కొత్తవలస కొండపై శారదా పీఠానికి కేటాయించిన భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని తమ పార్టీ స్వాగతిస్తోందని సీపీఐ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. తగరపువలసలోని ఆపార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదేవిధంగా ఆనందపురం మండలం తర్లువాడలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు కారుచౌకగా కేటాయించిన భూములను, భీమిలి బీచ్‌రోడ్డులో పలువుర్ని బెదిరించి అతి తక్కువ ధరలకు తీసుకున్న భూములను కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.





బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, తగరపువలస, డోర్ నెం. 6-45-127/9రు వాస్తవ్యులు M/s K.L. Developers, Represented by its Managing Partner లక్కోజు గంగరాజు గంగాధరరావు గారి కుమారుడు ఉమా గౌరీ మహేశ్వరరావు గారు నాకిచ్చిన భోగట్టాపై ఈక్రింది బహిరంగ ప్రకటన జారీచేయడమైనది.

ఈదిగువ షెడ్యూల్ ఆస్తిని విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, తగరపువలస గ్రామం, డోర్ నెం. 1-46-76రు వాస్తవ్యులు మాదాబత్తుల లేటు రాములు ఉరఫ్ రామారావు గారి భార్య 1. మాదాబత్తుల కమలావతి వీరి సంతతి 2. మాదాబత్తుల అప్పలరాజు, 3. మాదాబత్తుల ప్రసాదరావు 4. మాదాబత్తుల సాంబశివరావు 5. మాదాబత్తుల లేటు రాములు ఉరఫ్ రామారావు గారి కుమార్తె అర్జి సత్యనారాయణ గారి భార్య వరలక్ష్మీ 6. మాదాబత్తుల రవికుమార్ 7. మాదాబత్తుల ప్రసాదరావు గారి కుమారుడు శ్రీనివాసరావు గార్ల వద్ద నుండి పిత్రార్జితం అయిన ఆస్తిని జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన స్వాధీన క్రయ అగ్రిమెంటు ద్వారా S.R. Developers, తరపున మేనేజింగ్ పార్టనర్స్ అయిన వెంపాడ గురుమూర్తిరెడ్డి గారి కుమారుడు 1. వెంపాడ శ్రీనివాసరెడ్డి 2. నాగోతు నారాయణ గారి కుమారుడు నాగోతు రమేష్ G.P.A డాక్యుమెంటు నెం. 691/2013రుగా కొనుగోలు చేయగా వీరివద్ద నుండి జగ్గుపల్లి ప్రసాదరావు గారి భార్య అరుణతులసిగారు డాక్యుమెంటు నెం. 1380/2013రుగా కొనుగోలు చేసియున్నారు.

ఇట్లుండగా సదరు ఆస్తిని జగ్గుపల్లి ప్రసాదరావు గారి భార్య అరుణ తులసి గారి వద్ద నుండి నా క్లయింటు అయిన M/s. K.L. Developers, Represented by its Managing Partner లక్కోజు గంగరాజు గంగాదరరావు గారి కుమారుడు ఉమా గౌరీమహేశ్వరరావు గారు డెవలప్మెంటు తీసుకుని అపార్టుమెంటు కట్టుటకు నిర్ణయించుకుని అగ్రిమెంటు కుదుర్చుకొనియున్నారు.

సదరు ఆస్తిపై ఎవరికైనను ఎట్టి క్లయిములు, అభ్యంతరములు వగైరాలు ఉన్నచో ఈదినము నుండి 7 రోజులలోగా ఈ క్రింది అడ్రసుకు లిఖిత పూర్వకముగా, సంబంధించిన రికార్డులతో వచ్చి కలియవలెను. అట్లు కానియెడల సదరు ఆస్తి నిర్వివాద ఆస్తిగా పరిగణించి పైవ్యక్తుల నుండి నా క్లయింటు డెవలప్‌మెంటు చేయగలరు. తరువాత వచ్చే ఎట్టి అభ్యంతరములైనా పరిగణించబడవనియు అవి యేవియు నా క్లయింట్లను బంధింపజాలవనియు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, తగరపువలస గ్రామం, సర్వే నెం. 30/1లో భాగం, య. 0.28 సెంట్లులో భాగం 625.5 చదరపు గజములు లేక 525.42 చ.మీ విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమి ఖాళీ స్థలంనకు **హద్దులు: ఉత్తరం:** 30 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** ఎస్. ఆర్. డెవలపర్స్ సంస్థ వారి ఖాళీ స్థలం, **తూర్పు:** జగ్గుపల్లి సూరిబాబు గారి ఖాళీ స్థలం, **పడమర:** వెంపాడ అండాలు ప్రియ గారి ఖాళీ స్థలం

ముమ్మిడి శెట్టి సునీల్, న్యాయవాది,
ప్లాటు నెం. 304, బ్లు జే మెజెస్టిక్ అపార్టుమెంటు,
భీమునిపట్నం, పుట్ బాల్ గ్రౌండ్ వెనుక, భీమునిపట్నం,
తేది: 25.10.2024 విశాఖపట్నం జిల్లా-531163, సెల్: **9849668442.**

విశాఖ తూర్పు

యాగం పేరిట డబ్బు తీసుకొని మోసం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: దోష నివారణకు యాగం చేస్తానని ఓ మహిళ వద్ద నగదు తీసుకొని పరారైన సంఘటన మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిర్లంపూడి లేఔట్‌లో నివాసముంటున్న ఓ మహిళ ఇంటి వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి దోషముందని నమ్మబలికాడు. దీని నివారణకు యాగం చేయాలని.. ఇందుకు ముందుగా రూ.50 వేలు ఇవ్వాలని చెప్పాడు. ఆయన మాటలు నమ్మి ఆ డబ్బును ఇవ్వడంతో రెండు రోజుల్లో వస్తానని చెప్పి తిరిగి రాలేదు. మోసపోయానని గ్రహించిన మహిళ మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ రమణయ్య ఆధ్వర్యంలో ఎస్.ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలపై దృష్టి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: విద్య, గ్రంథాలయాల శాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చించి.. గ్రంథాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని, జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో అత్యాధునిక గ్రంథాలయ భవనాలను నిర్మించటానికి కృషి చేస్తానని విశాఖ ఎం.పి. శ్రీభరత్ అన్నారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. త్రిమూర్తులు, ఎం.పి. భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య: ఎంవీపీకాలనీ సెక్టారు-11లో రహదారులు చాలా వరకు ఛిద్రమయ్యాయి.
– శర్మ

సమాధానం: పరిశీలించి గోతులను పూడ్చుతాం.
– శ్రీను, వర్క్ ఇన్‌స్పెక్టర్

అ వీ ఇ వీ

■ విజయవంతంగా రోబోటిక్ శస్త్ర చికిత్స

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే మొదటిసారిగా బలహీనమైన గర్భాశయ మహిళకు రోబోటిక్ అబ్డామినల్ సెర్క్లేజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు మెడికవర్ వైద్యురాలు డాక్టర్ కిరణ్మయి తెలిపారు. విశాఖకు చెందిన 34 సంవత్సరాల మహిళ గతంలో ఆరు సార్లు అబార్షన్, రెటినోపతితో బాధపడుతున్న ప్రీమెచ్యూరిటీ ప్రసవం కూడా జరిగింది. రోగికి గర్భాశయ లోపం ఉందని, గతంలో అనేక గర్భధారణ నష్టాలకు దారి తీసిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇన్వాసివ్ రోబోటిక్- సహాయక అబ్డామినల్ సర్క్లేజ్‌ను ఎంపిక చేసి శస్త్రచికిత్స చేయటంతో ఆరోగ్యకరమైన బిడ్డ జన్మించిందని తెలిపారు.

■ లోగో ఆవిష్కరణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సంప్రదాయ నృత్య కాంగ్రెస్-2024 లోగోను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, డ్యాన్స్ ఇండియా మ్యాగజైన్ సంయుక్తంగా డిసెంబరు 27-29 వరకు నగరంలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు విక్రమ్ గౌడ్ తెలిపారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి, జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి తదితరులు పాల్గొన్నారు.

■ వ్యభిచార గృహంపై దాడి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: మద్దిలపాలెంలో ఓ ఇంట్లో ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఆ సమయంలో ఇంట్లో ముగ్గురు యువతులను రక్షించారు. ఒక విటుడిని, ఒక నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరొక నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. తదుపరి చర్యల నిమిత్తం ఎంవీపీకాలనీ స్టేషన్‌కు అప్పగించారు.

★ ఎంవీపీకాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో మద్దిలపాలెంలోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.10 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో జూద గృహంపై దాడి చేసి రూ.30 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

■ మర్యాదపూర్వక కలయిక

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగరానికి వచ్చిన మంత్రి బాల వీరాంజనేయస్వామిని పలువురు సంక్షేమశాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, ఆ శాఖ డి.డి. రామారావులతో పాటు గురుకుల విద్యాలయాల సమన్వయకర్త రూపవతి తదితరులు కలిశారు. శాఖపరంగా పలు అంశాలను ఆయన చర్చించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ

మెరుపు వేగంతో.. పతకాలు కొల్లగొట్టి

న్యూస్‌టుడే, ఎఫ్‌ఎంకాలనీ (ఎంవీపీకాలనీ)

కాళ్లకు చక్రాల బూట్లను ధరించిన క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. స్కేటింగ్ క్రీడల్లో ఒకటైన స్పీడ్ స్కేటింగ్‌లో చిన్నారులు ప్రతిభ చూపి పలు పతకాలను కొల్లగొడుతున్నారు. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించారు. దీంతో నవంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.



జాతీయస్థాయిలో రాణించాలని...



■ పేరు: డి.కుషాల్ సంపత్ ప్రణీత్
■ చదువు: 8వ తరగతి, సెయింట్ ఆలోసియస్ హైస్కూలు
■ పతకాలు: మూడేళ్ల క్రితం పుదుపారుల్లో స్పీడ్ స్కేటింగ్‌లో చేరాడు. అదే ఏడాది జిల్లాస్థాయిలో మూడు స్వర్ణాలు, రాష్ట్రస్థాయిలో కాంస్యపతకం సాధించాడు. ఇప్పటి వరకు 6 బంగారు, 6 రజత, 3 కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు. 11-14 ఏళ్ల వయసు విభాగంలో స్పీడ్‌లో పాల్గొన్న ప్రణీత్ జాతీయ స్థాయి బంగారు పతకమే తన లక్ష్యంగా చెబుతున్నాడు.

అంతర్జాతీయ గుర్తింపు కోసం..



■ పేరు: జాన్వికౌర్
■ చదువు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం
■ పతకాలు: పదేళ్ల వయసులో కాళ్లకు చక్రాల బూట్లను ధరించిన జాన్వికౌర్ స్పీడ్ ఇన్‌లైన్‌లో పలు పతకాలను గెలుచుకుంది. జిల్లా స్థాయిలో 25, రాష్ట్ర స్థాయిలో 21, జాతీయస్థాయిలో ఒక పతకం సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్కేటర్‌గా గుర్తింపు తెచ్చుకోవాలన్నది తన లక్ష్యమని చెబుతోంది.

మరిన్ని సొంతం చేసుకోవాలని..



■ పేరు: దినేష్
■ చదువు: 7వ తరగతి, బెజని స్కూలు
■ పతకాలు: 2023లో రాంచీలో జరిగిన ఓపెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో రెండు బంగారు పతకాలు, ఒక రజతం సాధించాడు. జిల్లా స్థాయి స్కూలు గేమ్స్, జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో మూడు బంగారం, మూడు రజతాలను గెలుచుకున్నాడు. జాతీయ స్థాయిలో కాంస్యంతో సత్తా చాటాడు.

పతకాల పంట పండిస్తూ..



■ పేరు: కె.జి.అభినవ్‌రామ్
■ చదువు: 7వ తరగతి, పొలాక్ స్కూలు
■ పతకాలు: 7-9 ఏళ్ల వయసు విభాగంలో రాణించాడు. 2022, 2023ల్లో 9-11 సంవత్సరాల బాలుర విభాగం రాష్ట్ర స్థాయిలో మూడు స్వర్ణాలు, ఒక కాంస్యం సాధించాడు. జోనల్ స్థాయిలో రజతం, 2 కాంస్య పతకాలు.. ఇటీవల జిల్లా స్థాయిలో 2 బంగారు, ఒక కాంస్యం కైవసం చేసుకున్నాడు.

తొలిసారి రాష్ట్రస్థాయిలో అవకాశం...



■ పేరు: కంచర్ల వసంత్ విహాన్
■ చదువు: 3వ తరగతి, టింపనీ స్కూలు
■ పతకాలు: నాలుగేళ్ల వయసులో కాళ్లకు చక్రాల బూట్లను ధరించాడు. స్పీడ్ ఇన్‌లైన్‌లో రాణిస్తూ ఏపీ ఓపెన్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం.. ఏపీ జోనల్, ఓపెన్ స్టేట్ ఛాంపియన్‌షిప్, జిల్లాస్థాయి పోటీల్లో ఒక బంగారు, 4 రజతాలు, రెండు కాంస్యాలు సొంతం చేసుకున్నాడు. తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గం ఎంవీపీకాలనీ డబుల్‌రోడ్డులో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన కనకదుర్గ ఆటోస్టాండ్‌ను ఏ.ఐ.టి.యు.సి. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నగరంలో పార్కింగ్ స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుంటుంటే, వారిని గమ్యస్థలాలకు చేర్చాలన్నా, పోలీసులు రాంగ్ పార్కింగ్ పేరిట జరిమానాలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవి, శేషుబాబు, సూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతికతతో సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో వల విసురుతున్నారని, దీనికి అప్రమత్తతతోనే అడ్డుకట్ట వేయగలమని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. శుక్రవారం ఎంవీపీకాలనీ ఏ.ఎ.ఎల్.ఎన్. కళాశాలలో సైబర్‌క్రైం-సైబర్ సెక్యూరిటీ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వ్యక్తుల బలహీనతను ఆసరాగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతుంటారన్నారు. డిజిటల్ ప్రపంచంలో సమాచార గోప్యత, అప్రమత్తత అవసరమన్నారు. సైబర్ నేరం జరిగిందని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. దీంతో పోగొట్టుకున్న సొత్తు వివిధ బ్యాంకులకు బదిలీ కాకుండా అడ్డుకట్ట వేయగలమన్నారు. ప్రతీ ఒక్కరికి సైబర్ పరిజ్ఞానం, నేరాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు. కళాశాల డీన్ డాక్టర్ ఎస్.ఆర్.రవీంద్ర, జాయింట్ డైరెక్టర్ పి.ఎం. బాలాజీ మాట్లాడుతూ వ్యాపార ప్రపంచంలో సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలన్నారు. అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, హాజరైన విద్యార్థులు

పక్కాగా పశుగణన చేయాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పశుగణనను పక్కాగా చేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం తెదేపా కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ అధికారుల సమక్షంలో అఖిల భారత పశు గణన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. అక్టోబరు 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన జరుగుతుందన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి పశువుల సమగ్ర వివరాలను సేకరించాలని సూచించారు. పశు సంవర్ధకశాఖ డి.డి. డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ఎ.డి. డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఇసుకతోట వైద్యశాల వైద్యురాలు వై.పూర్ణిమ, జె.వి.ఒ. శశికళ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

బీఎస్పీ సభ్యత్వ నమోదు

ఎం.వి.పి. కాలనీ, న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) సభ్యత్వ నమోదు శిబిరాన్ని పాత వెంకోజీపాలెంలో ఏర్పాటు చేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.శివప్రసాద్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారంతా సభ్యులుగా చేరాలని సూచించారు. బీఎస్పీ సీనియర్ నాయకులు, నగర పార్టీ అధ్యక్షులు బి.విశ్వనాథం ఆధ్వర్యంలో 500 మందికి సభ్యత్వ నమోదు చేశారు. నాయకులు రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

అక్రమ భూకేటాయింపు అధికారులను శిక్షించాలి

ఆరిలోవ: శారదా పీఠానికి అక్రమంగా కేటాయించిన భూముల వ్యవహారంలో గుడ్డిగా వ్యవహరించిన అధికారులను శిక్షించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆరిలోవలో ఉన్న భానాస కార్యాలయం నుంచి శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు



విజేతలకు బహుమతులందిస్తున్న ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు

ప్రతిభతో రాణింపు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్ శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు', 'సామాజిక మాధ్యమాల ప్రభావం' వంటి అంశాలపై వ్యాస రచన పోటీలు జరిగాయి. ఇందులో జె.చందు (8వ తరగతి), ఆర్.దివ్యశ్రీ (9వ తరగతి), ఎం.సాయి తనూజ (8వ తరగతి) ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు ముని విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు ఆడారి సన్యాసిరావు, డి.సులోచనా రాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

సదస్సులు మేధో చర్చలకు వేదికలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సదస్సులు మేధో చర్చలకు వేదికలుగా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఆన్ రిజర్వాయర్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఛాలెంజెస్'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ వర్తమాన ప్రాధాన్యత కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. విద్యతో పాటు క్రమ శిక్షణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వాటర్ రిసోర్సెస్ డిపార్టుమెంట్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ వి.శ్రీధర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమెటిక్స్ (ఐ.ఎస్.జి) విశాఖ ప్రాంతీయ కేంద్రం ఛైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావు ప్రసంగించారు. సదస్సులో చర్చించే అంశాల వివరాలను విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు వివరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య పి.వి.వి.సత్యనారాయణ వందన సమర్పణ చేశారు.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు

ధరలు నియంత్రించాలని ధర్నా

ఆరిలోవ, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు శుక్రవారం ఆరిలోవ లక్ష్మీనగర్ ప్రాంతంలో ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనాలోచిత నిర్ణయాలతో నిత్యావసరాల ధరలు పెరిగాయన్నారు. ఆరిలోవ ఏఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్, సాయినగర్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. నియోజకవర్గ కార్యదర్శి షేక్ రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సీఎన్ క్షేత్రపాలు, ఎ.దేముడమ్మ, కె.లక్ష్మణరావు, కాసుబాబు, ప్రజా నాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ప్రపంచ చిత్రకారుల దినోత్సవం

ఆరిలోవ, న్యూస్‌టుడే: చినగదిలి సంతపాలెంలో ఉన్న ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రపంచ చిత్రకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన చిత్రాలు, బొమ్మలను ప్రదర్శనలో ఉంచారు. డ్రాయింగ్ వేయడం ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.



చిత్రాలు గీయడంలో పిల్లలకు మెలకువలు నేర్పుతున్న ఉపాధ్యాయిని

ప్రపంచ జియో పార్కు ట్యాగ్‌కు యత్నం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: యునెస్కో నుంచి ప్రపంచ జియో పార్కు ట్యాగ్‌ను సాధించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రముఖ జియాలజిస్టు ఆచార్య రాజశేఖర్‌రెడ్డి కోరారు. నగర పర్యటనకు వచ్చిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి మాట్లాడారు. గత 12 ఏళ్లుగా దేశ విదేశాల్లో అన్ని చోట్లా ప్రచారం చేయటమే కాకుండా గ్లోబల్ జియో పార్కు కోసం వివరాలు సేకరించి ఉంచాన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ. కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జనసేన పర్యావరణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, నాయకులు వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతోనే సంతులిత అభివృద్ధి

ఎం.వి.పి.కాలనీ, ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: సామాజిక స్పృహతోనే సంతులిత అభివృద్ధి సాధ్యమని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ అన్నారు. ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు శుక్రవారం ఎంవీపీకాలనీలోని శాంతి ఆశ్రమం, లెబెన్స్‌హిల్ఫేలను సందర్శించారు. అధ్యాపకులు డాక్టర్ కోమలి సలోమి, డాక్టర్‌శ్యామ్, ఆశాకిరణ్, పుష్పలత, సూరిబాబు, శిరీషా, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: జిల్లా యాదవ సంక్షేమ సంఘానికి అనధికారిక అధ్యక్షులుగా ఒమ్మి సన్యాసిరావు గత ఐదేళ్లుగా వ్యవహరిస్తూ గత ఏడాది రాధాకృష్ణ మహోత్సవాలు జరగకుండా నీరుగార్చారని జిల్లా యాదవ సంక్షేమ సంఘం పెద్దలు ధ్వజమెత్తారు. నవంబరు 15న విశాఖ బీచ్‌రోడ్డులో గోకుల్‌పార్కులో శ్రీరాధాకృష్ణ వేడుకలు జరుపుతామని ఈ సందర్భంగా తెలిపారు. ఎంవీపీకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఒకటే కమిటీ ఉండటంతో సభ్యులు అసంతృప్తిగా ఉన్నారన్నారు. మూడేళ్ల పదవీ కాలం తర్వాత యాదవ సంక్షేమ సంఘం ఎన్నికలు జరపాల్సిన బాధ్యత పెద్దలకు ఉందన్నారు. ఎన్నికలు జరిగే వరకు అధ్యక్ష, కార్యదర్శుల వంటి పదవులను పరిగణనలోకి తీసుకోరాదన్నారు. వై.గోపాల్, జి.నరసింహారావు, ప్రసాదుల బాగ్యానంద్, కె.అప్పారావు, ఎం.సత్యనారాయణ, వెంకటరమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం ప్రతినిధులు

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులకు అర్హులైన అభ్యర్థులకు దరఖాస్తు చేసుకోవటానికి గడువును పెంచినట్లు సాంఘిక సంక్షేమశాఖ డి.డి.రామారావు తెలిపారు. ఈనెల 27లోగా జన్మభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. టెట్‌లో అర్హత కలిగి ఉండాలని, ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ ద్వారా ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు.

వెలమ సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వెలమ సామాజిక వర్గానికి నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లగుడు గోవిందరావు డిమాండు చేశారు. బీచ్‌రోడ్డు ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా వెలమ సామాజిక వర్గం వెనుకబడి ఉందన్నారు. వెలమ రైతులకు 100 శాతం రాయితీ రుణాలు అందజేయాలన్నారు. సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, ఉపాధ్యక్షులు వరుదు రాజ్, కార్యదర్శి శ్రీనివాసరావు, ఈశ్వరరెడ్డి, పైడంనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోవిందరావు

నవంబరు 11న వీఎంఆర్‌డీఏ వేలంపాటలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వి.ఎం.ఆర్.డి.ఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, ఆడిటోరియంలు, కార్యాలయాలు, ఖాళీ స్థలాలను నెలసరి, సంవత్సరం అద్దె చెల్లింపు ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు సంస్థ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి సిరిపురం బాలల ప్రాంగణంలో నవంబరు 11న ఉదయం 11 గంటల నుంచి టెండర్, బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు www.vmrda.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. 3 సంవత్సరాల కాలపరిమితిపై అద్దె కేటాయింపు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సిరిపురం వి.ఎం.ఆర్.డి.ఎ 8 అంతస్తు రెవెన్యూ విభాగంలో దరఖాస్తులు తీసుకుని.. ఇండియన్ ఓవర్సీస్ సిరిపురం బ్రాంచిలో రూ.2 వేలు చలానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 వేలు ధరావత్తు ది మెట్రోపాలిటన్ కమిషనర్, వి.ఎం.ఆర్.డి.ఎ పేరుతో డి.డి తీయాలన్నారు. దీన్ని నవంబర్ 8 లోపు కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే కులధ్రువీకరణ పత్రం సమర్పించాలని కోరారు.

దీపావళి పర్యావరణహితంగా నిర్వహిద్దాం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సంప్రదాయబద్ధంగా దీపావళి నిర్వహించుకోవాలని బోటనీ అధ్యాపకురాలు రమాదేవి విద్యార్థులకు సూచించారు. ఈస్టుపాయింట్ కాలనీ కేడీపీఎం స్మార్ట్ సిటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దీపావళిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పక్షులు, వృద్ధులు, పిల్లలకు హాని కలిగించకూడదని.. ఎకో వైజాగ్‌ను కాపాడుకుందామని తెలిపారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ సెక్రటరీ జి.వి.రత్నం, సిఫా సంస్థ ప్రతినిధులు హిమ, ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు.

విద్యార్థులు పోలీస్‌స్టేషన్ సందర్శన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఓపెన్ హౌస్‌లో భాగంగా ఆరిలోవ టీఐసీ పాయింట్‌కు చెందిన శ్రీ విజేత విద్యార్థులు ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారు స్టేషన్‌కి వచ్చిన దగ్గర నుంచి పోలీసులు చేసే న్యాయం వరకు ఏ విధంగా ఉంటుందో, తదితర విషయాలను శాంతిభద్రతల ఎస్సై కృష్ణ వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ఎన్నికల అధికారులు, విద్యార్థులు

ఓటు వజ్రాయుధం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. తూర్పు ఈఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్ డి.సునీత అన్నారు. శుక్రవారం ఎంవీపీకాలనీ సమతా డిగ్రీ, పీజీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డీన్ ఆచార్య విజయారవీంద్ర, డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ యామిని, ఎ.వి.కోటేశ్వరరావు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 6 నుంచి రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రసజ్ఞ సంస్థ తొమ్మిదవ జాతీయ బహుభాషా నాటకోత్సవం-2024 గోడ పత్రిక శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. భారతీయ నాటక రంగం ఔన్నత్యాన్ని, సాంకేతిక విలువలకు గీటురాయిగా నిలిచే ప్రదర్శనలు ఏరికూర్చి నవంబరు 6 నుంచి 9వ తేదీ వరకు సాయంత్రం వేళల్లో కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్ నాటకోత్సవాల డైరెక్టర్ డాక్టర్ వేమాలి త్రినాధరావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు

హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న ముగ్గురు అధ్యాపకులు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు కళాశాల విద్య కమిషనర్, మంగళగిరి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. బయోటెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ కె.రేఖ విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పదోన్నతి పొందారు. బోటనీ అధ్యాపకులు డాక్టర్ బి.చంద్రమౌళి చిత్తూరు జిల్లా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలకు.. జువాలజీ అధ్యాపకులు డాక్టర్ శామ్యూల్‌డేవిడ్‌రాజ్ కడప జిల్లా పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాలకు ప్రిన్సిపాళ్లుగా వెళ్లనున్నారు.


కె.రేఖ


బి.చంద్రమౌళి


శామ్యూల్ డేవిడ్‌రాజ్

విశాఖ ఉత్తరం
• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

వార్డుల్లో భాజపా సభ్యత్వ నమోదు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : యాభై అయిదో వార్డు తాటిచెట్లపాలెం శ్రీసాక్షి గణపతి ఆలయ ముఖద్వారం వద్ద శుక్రవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు జరిగింది. వార్డు అధ్యక్షురాలు పార్వతి, ఉపాధ్యక్షుడు సబ్బ భాస్కర్, నాయకులు కె.రత్న, ఎల్.గాంధీ డి. వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: జ్ఞానాపురం ప్రధాన రహదారిపై శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. భాజపా దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అత్తిలి శంకరరావు పాల్గొని సభ్యత్వం తీసుకున్న పలువురికి రసీదులు అందజేశారు. వార్డు భాజపా అధ్యక్షులు వంక సంజీవ్‌రావు, గనగల మూర్తి, గోవింద్‌సింగ్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించండి

గురుద్వారా, న్యూస్‌టుడే: పోర్టు ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఇనార్బిట్ మాల్‌లో స్థానికంగా ఉన్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, భాజపా ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్ రాజు ఇనార్బిట్‌మాల్ - రహేజా గ్రూప్ ఉన్నత మేనేజ్‌మెంట్ సభ్యులను కోరారు. శుక్రవారం సీతమ్మధారలో ఆయన నివాసంలో కలిసిన వారితో ఆయన మాట్లాడారు. నగరంలోని ఇతర ప్రదేశాల్లో కూడా రహేజా గ్రూప్ సంస్థలు మరిన్ని పెట్టుబడులు పెట్టి మరింత మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. దీనిపై గ్రూప్ సభ్యులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుతో ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు

బాణసంచా దుకాణాల పరిశీలన

మాధవధార, న్యూస్‌టుడే: ఉత్తర నియోజకవర్గంలో పోర్టు స్టేడియం, పంజాబుహోటల్ వద్ద ఉన్న శారదా గార్డెన్స్‌లో ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాలను గురువారం అగ్నిమాపక, విద్యుత్తు శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా దుకాణాలను ఏర్పాటు చేశారో లేదో పరిశీలించారు. ముందుగా అగ్నిమాపక, విద్యుత్తుశాఖ అధికారుల పరిశీలన అనంతరం జీవీఎంసీ, పోలీసు అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేయనున్నట్లుగా తెలియజేశారు.



శారదా గార్డెన్స్‌లో ఏర్పాటు చేస్తున్న దుకాణాలను పరిశీలిస్తున్న విద్యుత్తుశాఖ అధికారులు

ఆహ్లాదం కనుమరుగు

ఉద్యానవనాలు అసౌకర్యాలమయం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

నగరంలో ఉన్న కొన్ని పార్కుల నిర్వహణ నానాటికీ తీసికట్టుగా తయారైంది. ప్రధాన ప్రాంతాల్లో ఉన్న జీవీఎంసీ, రైల్వే, పోర్టుట్రస్టులకు చెందిన కొన్ని ఉద్యానవనాలు ఆహ్లాదాన్ని అందించడం సంగతేమో కాని, నిర్వహణ లేక ఈసురోమని ఎదురు చూస్తున్నాయి.

✦ కైలాసపురం ప్రాంతంలోని పోర్టు, డి.ఎల్.బి కాలనీలో ఉన్న పార్కుల నిర్వహణ తీసికట్టుగా ఉంది. ఇక్కడ పచ్చదనం మచ్చుకైనా కనిపించదు. స్థానిక యువత దీన్ని క్రీడా మైదానంగా మలుచుకొని ఆటలకు వినియోగించుకుంటున్నారు. పార్కులో కనీస సదుపాయాలు కల్పించాలని పోర్టు కాలనీ వాసులు పోర్టు యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేదు.



వ్యర్థాలతో నిండిన ధర్మానగర్‌లోని రైల్వే పార్కు

శిథిలావస్థలో రైల్వే పార్కు... రైల్వేశాఖ నలబై ఆరో వార్డు ధర్మానగర్‌లో ఏర్పాటు చేసిన పార్కు సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. పూల మొక్కలు మచ్చుకైనా కనిపించవు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులు సరైన నిర్వహణ లేక కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, కొన్నిటిని దొంగలు కాజేశారు. దీంతో ఇది ఆకతాయిలు, జూదరులకు నిలయంగా తయారైంది. పొద్దుపోతే ఇటు వైపు రావడానికి మహిళలు భయపడుతున్నారు.



పోర్టు కాలనీలోని పార్కు దుస్థితి

అభివృద్ధికి దూరం... నలభై ఆరోవార్డు పరిధి తాటిచెట్లపాలెం సంజీవయ్యకాలనీ వద్ద స్థానికుల సౌకర్యార్థం గతంలో జీవీఎంసీ అధికారులు ఓ పార్కును నిర్మించారు. సరైన నిర్వహణ లేక ఇది నిరుపయోగంగా తయారైంది. పచ్చదనం మచ్చుకైనా కనిపించదు. చిన్నారుల కోసం ఆట వస్తువులు లేవు. విద్యుత్తు దీపాలు, తాగునీటి సదుపాయం లేదు. ఒక వైపు రక్షణకు ప్రహరీ లేదు. పశువులు లోపలకి వచ్చి తిష్ట వేస్తున్నాయి. కాలనీలో ఏదైనా కార్యక్రమం ఉంటే స్థానికులు దీన్ని వినియోగించుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకొని నిరుపయోగంగా ఉన్న ఈ ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఆర్.ఇ.సి. నేషనల్ టాలెంట్ హంట్ బాక్సింగ్ పోటీల్లో ఎన్‌జీజీఓఎస్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబర్చారు. ఇందులో బి.నిహారిక సబ్ జూనియర్ పోటీల్లో 31-35 కేజీల విభాగంలో బంగారు పతకం, కె.భీష్మిత 52-55 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస, పి.డి. ఎ.సునంద్‌లు విద్యార్థినులను అభినందించారు.



విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీనరస, పి.డి.సునంద్

వ్యాస రచన పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: పోలీసు సంస్మరణ వారోత్సవంలో భాగంగా నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అక్కయ్యపాలెం 80 అడుగుల రహదారిలోని కేవీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైం నివారణలో యువత పాత్ర అనే అంశంపై జరిపిన పోటీల్లో 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు స్టేషన్ ఎస్.ఐ బహుమతులు అందజేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-8 వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. అపోలో ఆసుపత్రి సౌజన్యంతో జరిగే ఈ శిబిరంలో దంత, గుండె సంబంధిత వ్యాధులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు అందజేస్తారు. కాలనీ వాసులు ఈ సేవలను వినియోగించుకోవాల్సిందిగా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి కోరారు.

జి.ఎస్.టి. ఇన్‌స్పెక్టర్లు, పన్ను సహాయకుల శిక్షణ ముగింపు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (ఎన్.ఎ.సి.ఐ.ఎన్.), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్టర్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సి.బి.ఐ.సి.), డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అత్యున్నత శిక్షణ అకాడమీ విశాఖపట్నంలోని కేంద్ర, రాష్ట్ర కస్టమ్స్, సెంట్రల్ జి.ఎస్.టి. అధికారులకు శిక్షణ ఇచ్చింది. నూతనంగా నియమితులైన జి.ఎస్.టి. ఇన్‌స్పెక్టర్లు, పన్ను సహాయకులకు శిక్షణ ముగియడంతో శుక్రవారం నరసింహనగర్‌లోని ఎన్.ఎ.సి.ఐ.ఎన్. కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ జట్టి గోపీనాథ్, నాకిన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఈదర రవికిరణ్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన అధికారులకు ధ్రువపత్రాలను అందజేశారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఐజీ గోపీనాథ్

ఉద్యోగార్థులకు క్విజ్ నిర్వహణ

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖ పౌరగ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదువుతున్న ఉద్యోగార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు ఉద్యోగార్థులకు వర్తమాన అంశాలు, చరిత్ర, అర్థశాస్త్రం, భారత రాజ్యాంగం, సాంకేతిక విజ్ఞానం మొదలైన విషయాలపై ప్రశ్నావళి సంధించారు. ఈ పోటీలో 50మంది 7 బృందాలుగా పాల్గొన్నారు.

వృద్ధురాలి అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే: గొల్ల కంచరపాలెం ప్రాంతానికి చెందిన రమణమ్మ(70) మతిమరుపు సమస్య వల్ల వేపగుంట దరి కృష్ణరాయపురం వచ్చేసింది. టీచర్స్ లేఅవుట్‌లో సంచరిస్తుండగా శ్రీనివాస్ డయల్ 112కి ఫోన్ చేసి సమాచారం అందించాడు. పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ ఆదేశాలపై బ్లూకోట్ కానిస్టేబుల్ ఎం.గోవిందు బంధువుల చెంతకు చేర్చారు.

సాలూరి స్వర బాణీలు చిరస్మరణీయం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు వర్ధంతిని శుక్రవారం అక్కయ్యపాలెం సంగంఆఫీసు కూడలిలోని స్వరాలయ స్టూడియోలో నిర్వహించారు. రాజేశ్వరరావు, కోటి స్వరపరచిన చిత్ర గీతాలతో సంగీత విభావరి అలరించింది. ముందుగా రాజేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎ.సి.పి. నార్ని నరసింహమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు అధ్యక్షత వహించారు. కొణతాల రాజు, మెలోడి సత్యనారాయణ, సంస్థ అధినేతలు శివనారాయణ, విశ్వప్రసాద్ పాల్గొన్నారు.



సాలూరి రాజేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గాయకులు, ప్రముఖులు

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు హాస్పిటల్‌ను పి.పి.పి. పద్ధతిలో నిర్వహించేందుకు టెండర్లు దక్కించుకున్న ప్రయివేట్ సంస్థలను ఆసుపత్రిలోకి అడుగుపెట్టనీయమని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణను నిలిపివేయాలని కోరుతూ సాలగ్రామపురం పోర్టు హాస్పిటల్ వద్ద శుక్రవారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.ఎస్.పద్మనాభ రాజు మాట్లాడుతూ సుమారు 40 వేల మంది పోర్టు కార్మికులు, వారి కుటుంబాలకు సేవలు అందిస్తున్న పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరణ చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని పేర్కొన్నారు. నాయకులు జగన్, జె.సత్యనారాయణ, ఈశ్వరరావు, బి.లక్ష్మణరావు, రామలింగేశ్వరరావు, త్రినాధ్, కె.ఎస్.కుమార్, శ్రీను పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు.. కొన్ని రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను ప్రభావంతో పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్నింటిని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 26న హావ్‌డా-ఎస్‌ఎంవీటీ బెంగళూరు (12245) దురంతో, షాలిమార్-హైదరాబాద్ (18045), హావ్‌డా-తిరుపతి (20889) హమ్‌సఫర్, షాలిమార్-తిరునల్వేలి(06088) రైళ్లను రద్దు చేశారు.

★ సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్(20807) ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25న సాయంత్రం 6 గంటలకు బదులు 2.20 గంటలు ఆలస్యంగా రాత్రి 8.20 గంటలకు.., హావ్‌డా-చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ 25న రాత్రి 11.55 గంటలకు బదులు 3గంటలు ఆలస్యంగా 26వ తేదీ తెల్లవారుజామున 2.55 గంటలకు బయలుదేరేలా (రీషెడ్యూల్) మార్పు చేశారు.

కోయంబత్తూరు-బరౌని మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కోయంబత్తూరు-బరౌని-కోయంబత్తూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కోయంబత్తూరు-బరౌని (06055) ప్రత్యేక రైలు ఈనెల 26 నుంచి నవంబరు 16 వరకు ప్రతి శనివారం ఉదయం 11.50 గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ వచ్చి..10.50 గంటలకు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కోయంబత్తూరు(06056) ప్రత్యేక రైలు ఈనెల 29 నుంచి నవంబరు 19 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి రెండో రోజు తెల్లవారుజామున 3.48 గంటలకు దువ్వాడ వచ్చి..3.50 గంటలకు వెళుతుంది.

ముగ్గురు మందుబాబులకు జైలు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: హార్బర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో పక్కి గణేష్‌బాబు ఆధ్వర్యంలో కాన్వెంట్ కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని శుక్రవారం 4వ స్పెషల్ న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. లారీ డ్రైవర్లు ఎస్.రవిశంకర్ పట్నాయక్(50), ఎం.సాహు (22)లకు 15రోజులు, ఆటోడ్రైవరు పితాని కాళీ(35)కి 10రోజుల జైలు శిక్ష విధించారని హార్బర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ ఎస్.షణ్ముఖరావు తెలిపారు.

27న బీచ్ రోడ్డులో లేజర్ షో

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భారత్-పాక్(1971) యుద్ధానికి సంబంధించిన దృశ్యాలతో ఈనెల 27న బీచ్ రోడ్డులోని 'విక్టరీ ఎట్ సీ' స్థూపం వద్ద లేజర్ ప్రదర్శన ఉంటుందని జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు తెలిపారు. యుద్ధ వీరుల సాహసాలతోపాటు, దేశ చరిత్ర, ఘనతలను తెలిపేలా ఇకపై ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు లేజర్ షో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీల పథకాలను పునరుద్ధరించాలని వినతి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీల పథకాలను పునరుద్ధరించాలని జిల్లా దళిత సంఘాల సమాఖ్య (విదసం) కోరింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని గవర్నర్ బంగ్లాలో సంఘం ప్రతినిధులు బూసి వెంకటరావు, సుజాత, ఓంకార్, ఎల్లపు సంతోష్ రాజు, రవి, అఖిల్ తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు.



ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని సత్కరిస్తున్న నాయకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలోని రైతుబజార్లలో మత్స్యకారులకు ప్రత్యేకంగా స్టాల్సు కేటాయించాలని మత్స్యకార నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ముత్యాలు, రాంబాబు, సాయి బలరాం తదితరులు పాల్గొన్నారు. తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రిని కలిసి సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద మంత్రిని కలిసి ఆసుపత్రికి సంబంధించిన అంశాలను నివేదించారు.

ఇన్‌ఛార్జి మంత్రికి స్వాగతం



వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం ఉదయం గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై ఇద్దరు చర్చించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని విశాఖ ప్రాంతీయ సీఐడీ అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో 'సైబర్ సెక్యూరిటీ, సేఫ్టీ' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రేమ్‌కాజల్ మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరగాళ్ల బారిన పడితే కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలన్నారు. బాధితులు 1930కు ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మంజుల, సీఐలు బీవీజీ ప్రసాద్, పీవీవీ నరసింహారావు, ఎం.శేషు, ఎం.బుచ్చిరాజు, జీవీ రమణ, వై.రవి తదితరులు పాల్గొన్నారు.

27న సంగీత విభావరి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ రసజ్ఞ వేదిక, అంకోసా (ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న సాలూరు రాజేశ్వరరావు స్వరపరిచిన గీతాలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షులు డాక్టర్ జి.రఘురామారావు తెలిపారు.

విజయనగరం-రాయగడ సెక్షన్‌లో భద్రతా తనిఖీలు



రాయగడలో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ తదితరులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూ.కో. రైల్వే విజయనగరం-రాయగడ సెక్షన్‌లో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ శుక్రవారం భద్రతా తనిఖీలు నిర్వహించారు. లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా ఆడిట్ చేపట్టారు. మూడో లైన్ పనులు, స్టేషన్లలో సౌకర్యాలు, పాదచారుల వంతెనలు, యార్డులను పరిశీలించారు. అనంతరం మూడో లైన్ పనులను విండో ట్రైలింగ్ ద్వారా తనిఖీ చేశారు. ఏడీఆర్‌ఎం సుధీర్ కుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చదువు ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, సమాజంలో గుర్తింపు లభిస్తుందని పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పైడా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వాగతోత్సవం(ఫ్రెషర్స్ డే)లో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పైడా కృష్ణప్రసాద్

'రూ.3కోట్లు ఎక్కడికెళ్లాయ్..'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరవాసుల నుంచి వసూలు చేసిన చెత్త రుసుములు మాయం కావడంపై విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఒక ప్రకటనలో కోరారు. రూ.3కోట్ల వరకు జీవీఎంసీకి చేరకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు ఉన్నాయన్నారు.

యువజనోత్సవం.. కళాత్మకం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల పూర్వ విద్యార్థిని, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగ ఆచార్యులు బి.నళిని బెలూన్లు ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, మూకాభినయం, నాటకం, ఏకపాత్రాభినయం పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైజీ, అధ్యాపకులు నాన్సీ, పి.కె.జయలక్ష్మి, మాణిక్య కుమారి, సుధ, హరిణి, పావని, సిస్టర్ రోజ్, సిస్టర్ మేరీ పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థినులు వివిధ అంశాల్లో ప్రతిభను ప్రదర్శించారు.



బెలూన్లు ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, పెదగంట్యాడ, మల్కాపురం

?: జీవీఎంసీ 74వ వార్డు వియ్యపువాని పాలెం, దల్లివానిపాలెంలో యూజీడీ గుంతలు ప్రమాదకరంగా తయారయ్యాయి. మ్యాన్ హోల్ మూతలు సరిగ్గా లేకపోవడంతో పాద చారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
–కొండబాబు, పెదగంట్యాడ

✔: సంబంధిత సిబ్బందిని పంపి అవసర మైన చర్యలు తీసుకుంటాం. –శేషాద్రి, జెడీ

?: జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్రకాలనీ కొండవాలుపై గతంలో కురిసిన వర్షాలకు ఓ విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదక రంగా మారింది. వెంటనే సరి చేయాలి.
–గోపి, జైఆంధ్రకాలనీ

✔: సిబ్బందితో పరిశీలన చేయించి, వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
–శ్రీనివాసరావు, విద్యుత్తు విభాగం ఏఈ

?: జీవీఎంసీ 40వ వార్డు యారాడ రహ దారిలో ఆక్రమణలు పెరిగాయి. నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం.
–సత్యాంజనేయ, స్థానికుడు

✔:: క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆక్రమ ణలు తొలగిస్తాం.
–విజయకుమార్, పట్టణ ప్రణాళిక అధికారి

నేడు, రేపు వైద్య శిబిరాలు

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శనివారం బీసీరోడ్డు శ్రీసాయి కృష్ణ క్లినిక్, డెంటల్ ఆసుపత్రి ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గాజువాక లయన్స్ క్లబ్, మాధవ్ బాగ్ హాస్పిటల్స్, నగరాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మల్కాపురం నగరాల సంఘం కార్యాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు బి.సత్యారావు శుక్రవారం తెలిపారు.

విద్యుత్తు సిబ్బందికి గాయాలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో పెదగంట్యాడలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం రూరల్ సెక్షన్ పరిధి దయాల్‌నగర్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రసాద్ స్తంభంపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన ఘటన మరిచిపోక ముందే.. శుక్రవారం సాయంత్రం మరో ఘటన జరిగింది. ఆ వివరాలు.. పెదగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న స్తంభంపైకి ఎక్కిన ఎనర్జీ అసిస్టెంట్లు ప్రకాశ్, త్రినాథ్... 11 కేవీ లైను పునరుద్ధరణ పనులు చేపడుతుంగా ఒక్కసారిగా సరఫరా వచ్చింది. వెంటనే వారు కింద పడిపోయారు. ప్రకాశ్ కాలికి తీవ్ర గాయం కాగా, త్రినాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల్ని గాజువాకలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఏఈ, సబ్ ఇంజినీర్ స్తంభం వద్దే ఉన్నా.. విద్యుత్తు సరఫరా రావడం వెనుక ఎవరి పాత్ర ఉందో విచారణ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లఘించి.. కిందిస్థాయి సిబ్బందితో పనులు చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పర్యావరణ, జల సంరక్షణ చర్యలపై ఆరా

గాజువాక, న్యూస్‌టుడే : అధ్యయన యాత్రలో భాగంగా శుక్రవారం జీవీఎంసీ కార్పొరేటర్లు, అధికారుల బృందం తమిళనాడులోని బండిపూర్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్టును సందర్శించారు. కార్పొరేటర్లు జియ్యాని శ్రీధర్, ఎ.జె.స్టాలిన్, పీలా శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి తదితరులు అక్కడ స్పెషల్ కమిషనర్ వికాశ్ కిశోర్‌ను కలిసి పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వికాస్ కిశోర్‌ను అభినందించారు.

బాల వికాసం.. సృజన ప్రకాశం..!


గిరీశ్ విద్యానికేతన్‌లో...

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ: గాజువాక సమీప గాంధీనగర్ గిరీశ్ విద్యానికేతన్‌లో, వుడాకాలనీ బాల వికాస భారతదేశం పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభమా- నష్టమా', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇచ్చిన అంశాలను విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు.

● గిరీశ్ విద్యానికేతన్ పాఠశాలలో విజేతలుగా నిలిచిన పెద్దేటి కోమలి, ఎస్.ప్రణవి, కె.కావ్యాంజలికి పాఠశాల డైరెక్టర్ భీమిరెడ్డి శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

● వుడాకాలనీ బాలవికాస్ భారతదేశం పాఠశాలలో ప్రతిభ చూపిన గొర్లె చరణ్, సనపల దామోదరరావు, అర్హాన్ ఖాన్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడగల అప్పలనాయుడు, ఇతర ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


బాలవికాస్ భారతదేశం పాఠశాలలో..

నేటి నుంచి గౌరీ ఉత్సవాలు

పెదగంట్యాడ: పెదగంట్యాడ దయాల్‌నగర్‌లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

గాజువాక సినిమాలు..

కన్య: **దేవర**, హెవెన్: **జనక అయితేగనక..**, శ్రీకన్య: **వేట్టయన్**, లక్ష్మి: **లగ్గం**, అరుణ: అన్నపూర్ణ: **పొట్టేల్**, లక్ష్మీకాంత్: **ఎంత పని చేశావ్ చంటి**, మోహినీ 70 ఎంఎం: **విశ్వం**, మినీ మోహినీ, మోహినీ: **వెనమ్**, విశేష్ : **నరుడు బతుకు నటన..**; **గోపాలపట్నంలో..:** శ్రీనరసింహా : **పొట్టేల్**, నరసింహ: **వెనమ్**, సౌజన్య: **విశ్వం**, సుకన్య: **దేవర**, మౌర్య: **గ్యాంగ్‌స్టర్**

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


సూచనలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గాజువాక, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి, ఆరోగ్య సమాజ నిర్మాణానికి సహకరించాలని జోన్-6 ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం అజీమాబాద్‌లో 'డ్రైడే ఫ్రైడే' సందర్భంగా పరిశుభ్రతపై నివాసితులకు అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్లలో పోగయ్యే చెత్తను వీధుల్లో పడేయరాదని, ఇంటింటికీ వచ్చే జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. తెదేపా నాయకులు గోమాద వాసు, మహ్మద్ రఫీ, మహ్మద్ ముర్తజా, సత్యనారాయణ, బుజ్జి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న సమన్వయకర్త శ్రీనివాస్

గాజువాక, న్యూస్‌టుడే : తెదేపా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గాజువాకలోని అన్ని వార్డుల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినట్టు పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గాజువాక తెదేపా కార్యాలయంలో వార్డు కమిటీలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి రెండు నెలల పాటు కొనసాగే ప్రక్రియలో పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలని కోరారు. నాయకులు పల్లా విజయకుమార్, కోయిలాడ శంకర రావు, వెంకట్రావు, సత్యారావు, ఉగ్గం తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి


గోపాలపట్నంలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : పశుగణనకు పాడి రైతులంతా సహకరించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. అఖిల భారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆయన శుక్రవారం గోపాలపట్నంలో ఆవిష్కరించారు. పశుగణనతో పాల ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికలు అమలు చేసే వీలుంటుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎ.రవికుమార్, అసిస్టెంట్ బి.స్వప్న పాల్గొన్నారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పశుపోషణపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, అలాంటి వారికి మరింత ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందని 63వ వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు అన్నారు. శుక్రవారం పీఎస్‌యూకాలనీ పశువుల ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో పశువుల వివరాలు సేకరించారు.


వివరాలు సేకరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, ఇతర సిబ్బంది

టపాసుల విక్రయాలు ప్రారంభం


స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఉక్కు సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ

ఉక్కునగరం(స్టీల్‌ప్లాంట్ సెక్టార్-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కో-ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన దీపావళి సామగ్రి స్టాల్‌ను శుక్రవారం ఉక్కు చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తక్కువ ధరకే విక్రయిస్తున్న టపాసులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబీకులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. స్టోర్స్ అధ్యక్షులు డి.వి.నాగబాబు, ఇతర సభ్యులు ఆకుల నూకరాజు, బి.టి.జగదీష్, గంట్ల నాగభూషణం, ఇ.లోకేశ్, ఎన్.భాను, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలపై విన్నపం


మంత్రికి వినతి అందజేస్తున్న తెదేపా నాయకులు

అగనంపూడి, న్యూస్‌టుడే : ఫార్మాసిటీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని 85వ వార్డు తెదేపా నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం నగరంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని కలిసి వినతి పత్రం అందించారు. నిర్వాసిత కాలనీలో శ్మశానానికి స్థలం కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిర్వాసిత కుటుంబాలకు ఆర్ కార్డులు జారీ చేయాలని, స్థానిక వార్డు సచివాలయాల్లో ఖాళీల భర్తీ చేయాలని కోరారు. తెదేపా నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి దశేంద్ర, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం వినియోగంపై అవగాహన

ఉక్కునగరం(స్టీల్‌ప్లాంట్ సెక్టార్-3), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలని ఉక్కు భద్రతా విభాగం, సెంట్రల్ సేఫ్టీ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం ఉక్కు ప్రధాన గేటు వద్ద ప్రచారం నిర్వహించారు. శిరస్త్రాణం ధరించకపోతే ప్రాణాలకు ముప్పు ఉంటుందని అవగాహన కల్పించారు. భద్రతా విభాగం అధికారులు ఎం.ఎస్.ఎన్.రాజు, ప్రతినిధులు వై.సాంబశివరావు, రాము, భారతి, తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు గేటు వద్ద ప్రచారం చేస్తున్న ఉద్యోగులు

సమాజ శ్రేయస్సే లక్ష్యం


విద్యార్థులతో దువ్వాడ జీఆర్పీ ఎస్సై లక్ష్మి, హెచ్‌ఎం సూర్యప్రకాశరావు

కూర్మన్నపాలెం: సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేస్తుండాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల సేవలు మరువలేనివని దువ్వాడ జీఆర్పీ ఎస్సై కేటీఆర్.లక్ష్మి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం దువ్వాడ జీఆర్పీ పోలీసుల పర్యవేక్షణలో కణితి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం బి.సూర్యప్రకాశరావు, జీఆర్పీ హెచ్‌సీ డి.రాజు, సిబ్బంది ఎం.ఎస్.రాజు, స్వాతి, ప్రసాద్ పాల్గొన్నారు.

'టెక్స్‌టైల్' రంగంపై ప్రత్యేక శిక్షణ

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే: టెక్స్‌టైల్ రంగంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కోర్సు ఏర్పాటు చేసినట్లు విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. శుక్రవారం దువ్వాడ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రాండిక్స్ అపెరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు అధికమవుతాయన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారి ప్రతిభ ఆధారంగా పరిశ్రమలో గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా నియమిస్తారని కార్యక్రమం కో-ఆర్డినేటర్ ఎ.నాగజ్యోతి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ పాల్గొన్నారు.

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం


కమ్ముకున్న పొగ, సిబ్బంది సహాయక చర్యలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ సమీప గంగవరం రోడ్డులోని వెంకన్నపాలెం వద్ద ఉన్న ఇనుప తుక్కు దుకాణంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి, సమీప సత్యనారాయణపురం, కొంగపాలెం, కుంచేపాలెం వీధి వరకు పొగ వ్యాపించడంతో నివాసితులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్‌సర్క్యూట్ విద్యుత్తు తీగల నుంచి నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగి ఉంటాయని, సుమారు రూ.1.80 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారి గోపీకృష్ణ తెలిపారు. జనావాసాల మధ్య తుక్కు యార్డులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.